




పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తదితరులు

గరం గరం

ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో వైసీపీలో పరిస్థితి గరంగరంగా మారుతోంది. ఇప్పటికే నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పార్టీకి దూరమయ్యారు. తాజాగా పలువురు ఆయన బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఇప్పటి వరకు సమావేశాలు, ప్రకటనలకే పరిమితమైన అసమ్మతి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమైంది. జగన్‌పై కినుకతో ఉన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి నేరుగా రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు. మరోవైపు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. కొద్దిరోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న మక్కెన తన అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలోనే వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పల్నాట అధికార పార్టీలో రాజకీయం రంజుగా మారుతుండగా.. స్థానిక నేతపై వివక్ష చూపుతూ రాజకీయ బదిలీపై తీసుకువచ్చిన నేతపై అధిష్ఠానం ఆపేక్ష చూపుతుండటంపై క్యాడర్ అయోమయానికి గురవుతోంది.

- పల్నాడు వైసీపీలో విభేదాలు
- గురజాలలో కాసు వర్సెస్ జంగా
- ఫ్లెక్సీల్లో జంగా ఫొటో లేదని తొలగింపు
- స్వగ్రామంలో కార్యక్రమానికి పిలుపులేదని ఎమ్మెల్సీ ఆగ్రహం
- గామాలపాడులో కాసు, కృష్ణమూర్తి వర్గీయుల మధ్య ఉద్రిక్తత

ప్రొటోకాల్ రగడ.. సభ వాయిదా

- ఎందుకొచ్చారని అధికారులపై జంగా ప్రశ్నల వర్షం

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: గురజాలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి.. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్సీ అయినా నియోజకవర్గంలో తనకు సరైన గౌరవం దక్కడం లేదని జంగా ఆగ్రహంతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సొంత గ్రామంలో జరిగే ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేకపోవడంపై జంగా మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు, ఎమ్మెల్సీ జంగా వర్గీయుల మధ్య దాచేపల్లి మండలంలోని గామాలపాడులో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జంగా కృష్ణమూర్తి స్వగ్రామమైన గామాలపాడులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం, కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన తదితర కార్యక్రమాలను ఆదివారం ఏర్పాటు చేశారు. స్వగ్రామమైన గామాలపాడులో జరిగే ఆసరా సభకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కాని, స్థానిక అధికారుల నుంచి కాని ఎటువంటి పిలుపు లేకపోవడంతో జంగా తీవ్ర అవమానంగా భావించారు. మాట మాత్రమైనా చెప్పకుండానే గ్రామంలో సభ ఎలా పెడతారని సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వరా అంటూ జంగా మండిపడ్డారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాసు వర్గీయులు గ్రామంలోని సచివాలయం, పంచాయతీ కార్యాలయం, ప్రధాన కూడలిలో జంగా, సర్పంచ్ ఫొటోలు లేకుండా ఎమ్మెల్యే కాసు, ఇతర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ సురేష్ జంగా తనయుడే. ఈ క్రమంలో సమాచారం అందుకున్న జంగా వర్గీయులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు. తమకు తెలియకుండా తమ గ్రామంలో ఇష్టానుసారంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం ఏమిటి.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ సహించబోమని ఫ్లెక్సీలు కట్టే వారిని హెచ్చరించారు. దీంతో కాసు, జంగా వర్గీయుల మధ్య తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఫ్లెక్సీల తొలగింపుపై వైసీపీ నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ సంధ్యారాణి గామాలపాడు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గుంటూరు నుంచి ఆదివారం ఉదయమే స్వగ్రామం గామాలపాడు చేరుకున్న జంగా నేరుగా సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న సీఐ సురేంద్రబాబు, ఇతర అధికారులతో మాట్లాడుతూ ఇక్కడ ఏమి జరుగుతుందని మీరందరు వచ్చారు.. ప్రశాంతంగా ఉన్న గ్రామాన్ని ఐక్యంగా ఉన్న గ్రామస్తులను ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని కోరారు. అధికారులే కావాలని ఉత్సాహం చూపుతున్నారని జంగా ప్రశ్నించారు. అనవసరమైన చోట ఉత్సాహాన్ని చూపవద్దని, నేను ప్రభుత్వ విప్‌ను, ఎమ్మెల్సీని నాకు కార్యక్రమాలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా.. తనను గౌరవించాల్సిన అవసరం ఉందా లేదా అంటూ అని ప్రశ్నించారు. అధికారం ఎప్పుడూ ఒకేవైపు ఉండదు.. ఎవరికిచ్చే మర్యాదలు వారికి ఇవ్వాలని అధికారులను మీరంతా వెళ్లిపోవచ్చు.. ఇక్కడ ఏమీ జరగడం లేదు.. అని జంగా అధికారులకు స్పష్టం చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై తాను ఫిర్యాదు చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామంలోని తన నివాసంలో జంగా సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రొటోకాల్ విషయంపై ఏర్పడిన ఉద్రిక్తత వాతావరణంతో అధికారులు ఎమ్మెల్యే కాసుతో మాట్లాడి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

బీసీలంటే లోకువా?

మేము బీసీలు కావడమే నేరమా.. బీసీలుగా ఉండటమే మా తప్పా.. ప్రజాప్రతినిధులుగా ఉన్న సొంత గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించరా.. గౌరవించరా.. బీసీలంటే అంత లోకువయ్యామా.. బడుగు బలహీన వర్గాలంటే మాకు ఎంతో అభిమానమని చెప్పడమే తప్ప ఆచరణలో మాత్రం కనిపించడం లేదు.. అంటూ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక నాయకుడిగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీగా ఉన్న తనకు స్వగ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికే చెప్పకుండా ఎమ్మెల్యే కాసు ఎలా వస్తారని జంగా కృష్ణమూర్తి మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవి కన్నా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ అయిన తన పదవి పెద్దదే అయినా అధికారుల నుంచి నేతల వరకు బీసీలంటే చిన్నచూపు అని తెలిపారు.

దొరల పాలన సాగదు

- గురజాలకు ఎమ్మెల్యే కాసు చేసిందేమీలేదు
- అధికారం, డబ్బు, దోపిడీ శాశ్వతంగా ఉండదు
- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఆరోపణ

గురజాలలో అంబేద్కర్ రాజ్యాంగం కొనసాగడం లేదు.. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రాజ్యాంగం నడుస్తుంది.. దొరల పాలన నడుస్తుంది.. ఇది ఎంతోకాలం సాగదు.. దీనికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. అని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యే కాసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గామాలపాడులో జంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమానికి తననుగాని, సర్పంచ్‌కి గాని సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రజాప్రతినిధులుగా తమను గౌరవించడం లేదని మండిపడ్డారు. అధికారం, డబ్బులు, దోపిడీ శాశ్వతం కాదని, అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా చేసుకుంటూ పోతే బలహీనవర్గాల ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే కాసుపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ అయిన తనను, సర్పంచ్ అయిన తన కుమారుడికిగాని మాటమాత్రమైనా చెప్పకుండానే అధికారులు తమ స్వగ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గామాలపాడు వాసిగా గుర్తించి ఆహ్వానించాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. బడుగు బలహీనవర్గాలను వేధించడం, ఇబ్బందులు పెట్టడమే ధ్యేయమా, అవమానించడమే మీ లక్ష్యమా అని ప్రశ్నించారు. నిన్న గాక మొన్న గురజాలకి చెందిన కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజును బెదిరించడం, స్వామిమాలలో ఉన్నా మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టించారన్నారు. గతంలో కూడా భట్రుపాలెం, శ్రీనగర్ గ్రామాలకు చెందిన ఎస్సీ ఎస్టీలైన ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. గ్రామాల్లో చిచ్చుపెట్టి, మద్యం పోసి, డబ్బులిచ్చి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారని ఇది ఎంతమాత్రం తగదన్నారు. కోట్ల రూపాయలతో గురజాల అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే కాసు చెబుతున్నారని కానీ ఆయన చేసింది ఏమీలేదని జంగా స్పష్టం చేశారు. 70 ఏళ్లగా పిడుగురాళ్లకి నీళ్ల లేకపోతే తాను తెచ్చానని చెబుతున్నారని కాని ఎప్పుడు.. ఎక్కడ తెచ్చారని కాసును ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గోవిందాపురం నుంచి రూ.37 కోట్లతో కృష్ణా జలాలను పిడుగురాళ్లకు తీసుకొచ్చానని జంగా తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులతో చేపట్టిన కార్యక్రమాలన్నింటినీ తాను చేసినట్లు కాసు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, మాజీ జడ్పీటీసీ భూషణం చెన్నయ్య, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మాశెట్టి పుల్లారావు, 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్, మాజీ ఎంపీటీసీ జక్కా జానకిరామయ్య తదితరులున్నారు.



గామాలపాడు గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ సురేంద్ర బాబు తదితరులు

బొల్లా అహంకారి, డబ్బు గర్వం

- ఎమ్మెల్యే ధోరణితోనే వైసీపీని వీడుతున్నా
- పార్టీకి రాజీనామా ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పదవి, డబ్బు గర్వంతో రాజకీయాలు చేస్తున్నారు. ఓట్లు వేసిన ప్రజలను అవమానిస్తున్నారు.. ఎమ్మెల్యే బొల్లా అహంకార ధోరణితోనే వైసీపీని వీడుతున్నాను.. అని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైసీపీకి రాజీనామా చేశారు. బొల్లా వ్యవహార శైలి వినుకొండలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన పది మందికి భిన్నంగా ఉందని, దౌర్జన్యాలు, అరాచకాలు, అహంకారంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని కేజీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన తన రాజీనామాను ప్రకటించారు. తొలుత గుర్రం జాషువా, పులుపుల వెంకటశివయ్య, మక్కెన చినరామయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మక్కెన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై, వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ రాజశేఖరరెడ్డి మీద అభిమానంతో జగన్‌ను సీఎం చేసేందుకు 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను వీడి వైసీపీలోకి చేరినట్లు తెలిపారు. పదవులు, అధికారం కోరుకోలేదని, గౌరవం మాత్రమే కోరుకున్నానని, కానీ అది లేకపోగా వ్యక్తిగతంగా నష్టం చేశారన్నారు. గతంలో వేల్పూరులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయుల సమక్షంలోనే గడిపూడి నరేంద్ర అనే రైతును ఎమ్మెల్యే చెప్పుతో కొట్టబోయారన్నారు. గతంలో నన్నపనేని సుధ భర్త డాక్టర్ లతీఫ్‌రెడ్డిపైన, ఇటీవల వినుకొండలో అంగన్‌వాడీలపై బొల్లా ప్రవర్తించిన తీరు బాధ వేసిందని, ఇవన్నీ ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. బొల్లాపల్లిలో ఏర్పాటు కావాల్సిన ఆశ్రమ పాఠశాల శ్రీశైలం ప్రాంతానికి తరలివెళ్లిందన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో వెంకుపాలెం సమీపంలో ఏర్పాటు కావాల్సిన పథకం సత్తెనపల్లికి పోయిందన్నారు. ఐదు డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్‌లకు అనుమతి వచ్చినా పనులు నిలిచిపోయాయని, వీటికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. తనకు కేటాయించిన ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌ను కూల్చివేయవద్దని స్వయంగా ఎమ్మెల్యేకు తెలిపినా రాత్రికి రాత్రే కూల్చివేయించారన్నారు. బొల్లా తీరుపై అధిష్ఠానానికి చెప్పానని, వినుకొండ ప్రాంతంలో డబ్బు పెట్టుకునే వారు లేకపోవడం వల్ల మళ్లీ టికెట్‌ను బ్రహ్మనాయుడుకే కేటాయిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈ పరిస్థితుల్లో బొల్లాతో కలిసి వెళ్లలేనని అధిష్ఠానానికి తేల్చిచెప్పినట్లు మక్కెన తెలిపారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు అనుమతులు, నూజెండ్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ బ్రిడ్జి, సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు చేయించిన శ్రీకృష్ణదేవరాయులకు వైసీపీ సీటు ఇవ్వలేమని చెప్పడం బాధేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు ఇక్కడే ఉంటానని, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభీష్టం మేరకు త్వరలో రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వరికపూడిశెల సాధన సమితి నాయకుడు డి.రమణారావు, తుమ్మా వెంకటరెడ్డి, గుత్తా కోటేశ్వరరావు, అనుముల ప్రసాద్, కౌన్సిలర్ నన్నేసా, సూర్యానాయక్, ఎలిశెట్టి నరసింహారావు, గుడివాడ చినగుర్నాథం, ఎ.వినయ్‌కుమార్, గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, హాజరైన అనుచరులు

రీసర్వే.. 35 శాతమే

- రెండేళ్లుగా నత్తనడకన
- భూముల రీసర్వే ఎప్పటికి పూర్తయ్యేనో?
- షెడ్యూల్ ప్రకారం ఈపాటికే పూర్తి చేయాలి
- 77 గ్రామాల ఓఆర్‌ఐలు ఎప్పటికి వస్తాయో తెలియదు

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష (భూముల సమగ్ర రీసర్వే) జిల్లాలో నత్తకు నడక నేర్పుతున్నది. మరి కొన్నేళ్ల సమయం ఇచ్చినా రీసర్వే పూర్తి అయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే సర్వే ప్రారంభమై రెండేళ్లు ముగిసిపోగా నేటికీ 35 శాతం గ్రామాల్లోనే పూర్తి అయినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతానికి గ్రామాల్లోనే సర్వే జరుగుతున్నది. ఇవికాక సీఆర్‌డీఏ పరిధిలోని 24 గ్రామాలు, అర్బన్ పరిధిలో ఉన్న మరో 26 గ్రామాల సర్వే పూర్తి చేయాలంటే కనీసం మరో నాలుగైదేళ్ల సమయం పట్టే అవకాశం లేకపోలేదు. జిల్లాల విభజన అనంతరం పరిపాలన సులభతరం అవుతుందని అంతా ఆశించినప్పటికీ అందుకు విరుద్ధంగా మందగించిందనడానికి ఈ భూముల రీసర్వేనే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నది. జిల్లాలో మొత్తం 223 గ్రామాల పరిధిలో 5 లక్షల 95 వేల ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి. సీఆర్‌డీఏ, అర్బన్ గ్రామాలను మినహాయించి మిగిలిన 173 గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. ఈ గ్రామాల్లో భూముల విస్తీర్ణం 4 లక్షల 64 వేల ఎకరాలుగా ఉన్నది. ఇప్పటి వరకు డ్రోన్ ఫ్లై అన్ని గ్రామాల్లో పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఓఆర్ఐ(ఆర్థోరెక్టిఫైడ్ రాడార్ ఇమేజ్)లు మాత్రం 96 గ్రామాలకు సంబంధించినవే సర్వే ఆఫ్ ఇండియా, మరో ప్రైవేటు సంస్థ నుంచి వచ్చాయి. ఓఆర్ఐలు వస్తే తప్ప గ్రౌండ్ ట్రూథింగ్ జరిపి సర్వే ప్రక్రియని పూర్తి చేయడానికి అవకాశం లేదు. ఇందుకు కారణం ఆయా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపు నిలిచిపోవడమేనన్న ప్రచారం సర్వే వర్గాల్లో ఉంది.

మూడు డ్రోన్‌లు మాయం

సంక్రాంతి తర్వాత తాడికొండలో డ్రోన్ ఫ్లై చేపట్టగా కొండలు, అటవీ ప్రాంతంలో సక్రమంగా ఎగరలేదు. ఒకటి గాలిలోనే తునాతునకలు కాగా మరో రెండు గల్లంతయ్యాయి. ఆ తర్వాత కొత్త డ్రోన్లు తెప్పించి పూర్తి చేశారు. ఇది కూడా ఓఆర్‌ఐలు రాకపోవడానికి కారణంగా సర్వే ఉద్యోగులు చెబుతున్నారు. నాన్ సీఆర్‌డీఏ గ్రామాలైన పెదపరిమి, హరిశ్చంద్రాపురం, వడ్డమానులో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా భూములు కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు వారి చిరునామాలు తెలియకపోతుండటంతో గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి చేయడంలో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. కాగా ఇప్పటివరకు 96 గ్రామాలకు సంబంధించిన ఓఆర్‌ఐలు రాగా వాటిల్లో మూడు విడతలుగా 61 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తి చేసి 34,699 మంది పట్టాదారులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. మరో 35 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్, హద్దురాళ్ల వేయడం వంటి ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అయితే మూడో విడత భూముల రీసర్వే గత ఏడాది అక్టోబరు/నవంబరు నెలల్లోనే పూర్తి కావాల్సి ఉన్నది. మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. షెడ్యూల్‌ని పరిగణనలోకి తీసుకుంటే ఇప్పట్లో భూముల రీసర్వే పూర్తి అయ్యే పరిస్థితి ఏ కోశానా కనిపించడం లేదు.



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ధర్మ పోరాటం చేస్తుంటే అక్రమ కేసులా?

- 1510వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

రాక్షస ప్రభుత్వానికి ఎదురొడ్డినందుకు అభినందనలు


- గ్రామ అభివృద్ధి నగ్న సత్యాల కరదీపిక పుస్తకావిష్కరణ
- సాయిబాబాను అభినందించిన మాజీ మంత్రి ఆనందబాబు

6లో..

ఈ నెలా.. వెతలే



- ఐదో తేదీ వచ్చినా అందని వేతనం
- గత నెల 24న పెట్టిన బిల్లులకే జీతాలు
- దయనీయంగా ప్రభుత్వ పెన్షనర్ల కష్టాలు
- నాలుగేళ్లుగా జీతాల జాప్యంతో ఉద్యోగుల పాట్లు
- ఎన్నికలు సమీపిస్తున్నా మార్పులేని ప్రభుత్వ వైఖరి



గుంటూరు ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేతన వెతలకు విముక్తి కలగడంలేదు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఈ నెలలో జీతాలకు జాప్యం ఉండదు.. పరిస్థితులు మారతాయి.. అని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. 5వ తేదీ వచ్చినా అనేక విభాగాల ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఇక పెన్షనర్ల పరిస్థితి దయనీయంగా ఉంది. నాలుగేళ్లుగా ఏదైతే పరిస్థితి ఉందో అదే పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం వేతన జీవుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఒకటో తేదీ పోయి ఐదు రోజులు కావస్తున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాలో సగం మంది ఉద్యోగులకు కూడా కష్టార్జితం దక్కలేదు. తొలివిడతగా కిందటి నెల 24వ తేదీ నాటికి వేతన బిల్లులు పెట్టుకున్న ఒకటి అరా బిల్లులకు మాత్రమే వేతనాలు వచ్చినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగుల వేతన బిల్లులను డ్రాయింగ్ అధికారులు ప్రతి నెలా 25వ తేదీ, ఆ తర్వాత మాత్రమే ట్రెజరీ కార్యాలయాలకు పంపుతారు. అతి కొద్దిమంది మాత్రమే 25వ తేదీలోపు బిల్లులు పెట్టుకుంటారు. అలా పెట్టుకున్న ఒకటి రెండు విభాగాల ఉద్యోగులకు మాత్రమే వేతనాలు ఇచ్చి ప్రభుత్వం మిగిలినవారి వేతనాలను పెండింగ్ పెట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా మారింది. రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా వీరికి తోడయ్యారు. ప్రతి నెలా పదో తేదీ దాటకుండా వీరికి పెన్షన్లు, వేతనాలు దక్కడం లేదు. ఆర్బీఐ వద్ద ప్రతి మంగళవారం జరిగే బాండ్ల వేలం, రుణ పరిమితిపైనే వీరి వేతనాలు ఆధారపడ్డాయా అన్నట్లుగా పరిస్థితి తయారైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 40శాతం మంది ఉపాధ్యాయులకు కూడా వేతనాలు దక్కలేదు. ఉమ్మడిజిల్లాలో ఇప్పటివరకూ ఒక్కరికి కూడా పెన్షన్ అందలేదు. ఆర్థికశాఖ కేంద్రకార్యాలయం చుట్టూ తిరిగితే తప్ప తమకు వేతనాలు, పెన్షన్లు పడే పరిస్థితిలేదని ఉపాధ్యాయులు, పెన్షనర్లు వాపోతున్నారు.

పోలీసు, సచివాలయ ఉద్యోగులకే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు 70 ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 50 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారికి తోడుగా వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన సచివాలయ ఉద్యోగులు మరో 12 వేల మంది వరకూ ఉన్నారు. కార్యకలాపాల నిర్వహణలో కీలకమైన అన్ని ప్రభుత్వ శాఖలను వదిలేసి ప్రభుత్వం పోలీసు, సచివాలయ, వైద్య, న్యాయ శాఖల ఉద్యోగులకు మాత్రమే తొలివారం వేతనాలు అందుతున్నాయి. ప్రధానంగా పోలీసు, సచివాలయ ఉద్యోగులే ప్రభుత్వ ప్రాధాన్యంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలు సహా అన్ని ప్రాధాన్య శాఖల ఉద్యోగులకు మాత్రం రెండో వారంలోనో, పదో తేదీ తర్వాతనో ప్రభుత్వం వేతనాలు ఇస్తోంది.

రెండు నెలల తర్వాతైనా పరిస్థితి మారుతుందా?

మరో రెండు నెలల్లో వచ్చే ఎన్నికలపైనే వేతన జీవులు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే తమ కష్టాలు తీరుతాయని వారు బలంగా నమ్ముతున్నారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, తిరిగి కోలుకోలేనంతగా అప్పుల ఊబిలో ముంచేసిన ప్రస్తుత ప్రభుత్వ విధానాల నుంచి రాష్ట్రం ఎప్పుడు బయటపడుతుంది అనేది సమాధానం లేని ప్రశ్న! రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడేవరకూ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ కష్టాలు తప్పకపోవచ్చన్న భావన కూడా వారిలో ఉంది.

పల్నాడులో వైసీపీ నేతల భూకబ్జాలు

- రికార్డులు మార్చి రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులపై ఒత్తిడి
- టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్నింటిపైనా విచారణ
- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 4: గురజాల నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి దాకా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, ప్రైవేటు ఆస్తులను వైసీపీ నేతలు కబ్జా చేస్తున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం పిడుగురాళ్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నిషేదిత భూముల జాబితాలోవున్న పిడుగురాళ్లలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ భూములను సైతం ప్రైవేటు వ్యక్తులు, ఎమ్మెల్యే కాసు అనుచరులైన మాజీ జడ్పీటీసీ రామిరెడ్డి, డాక్యుమెంట్ రైటర్ లింగారెడ్డి, వీఆర్వో సత్యారెడ్డిలు మరొకరి పేర్లతో రికార్డులను మార్చి రిజిస్ట్రేషన్ చేయాలని ఆ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రభుత్వ భూముల రికార్డులను మార్చి 1-బి, అడంగల్ సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లకు పాల్పడిన ఘటనలన్నింటిపై అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. వారి బినామి అయిన ఊటుకూరి శివగోవిందారెడ్డి ప్రైవేటు ఆసుపత్రుల్లో సూపర్ వైజర్‌గా చేస్తూ కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని యరపతినేని ప్రశ్నించారు. 2014లో కోనంకిలో కొందరికి ఇచ్చిన పట్టాలు జాబితాలో వైసీపీ అధికారంలోకి వచ్చాక మరో కొన్ని పేర్లు అనధికారికంగా చేర్చేసి రికార్డులు మార్చేయడంతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అన్నపురెడ్డి రామిరెడ్డి, సుశీల పేరుతో 3.31 సెంట్లు, అన్నపురెడ్డి శ్రీలక్ష్మీ, వెంకటకృష్ణారెడ్డి పేరుతో 3.42 సెంట్లు, అన్నపురెడ్డి పుష్పావతి, మరొకరి పేరుతో 1.80 సెంట్లను ముగ్గురి పేర్లను పెన్నుతో అనధికారికంగా జాబితాలో చేర్చి హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దాచేపల్లిలోను నకిలీ రేషన్‌కార్డులు సృష్టించి వైసీపీ నేతలు భూపట్టాలకు పాల్పడ్డారన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన నీలంరాజు ఎంపీ శ్రీకృష్ణదేవరాయులకు మద్దతుగా నిలిచి వైసీపీకి రాజీనామా చేస్తే అతనిపై బెదిరింపులకు పాల్పడటం ఏమిటని యరపతినేని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా గురజాల నుంచి తాను ఏడోసారి పోటీ చేయబోతున్నానని యరపతినేని మరోసారి స్పష్టం చేశారు. సమావేశంలో పాండురంగ శ్రీను, బాబావలి, తురకా వీరస్వామి, కనిగిరి శ్రీను, కోట హరి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌అలి, ఎస్ఆర్ఎంటీ సుబ్బారావు, పణితి రవి, మేకల సాంబశివరావు, పిల్లి చెన్నారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశిం, వల్లెపు రామకృష్ణ, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస ప్రభుత్వానికి ఎదురొడ్డినందుకు అభినందనలు

- గ్రామ అభివృద్ధి నగ్న సత్యాల కరదీపిక పుస్తకావిష్కరణ
- సాయిబాబాను అభినందించిన మాజీ మంత్రి ఆనందబాబు


కరదీపికను ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 4: వైసీపీ రాక్షస ప్రభుత్వానికి ఎదురొడ్డి ధైర్యంగా నిలిచిన భట్టిప్రోలు గ్రామ టీడీపీ కార్యకర్తలు అభినందనీయులని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా రూపొందించిన భట్టిప్రోలు గ్రామ అభివృద్ధి నగ్న సత్యాల కరదీపిక పుస్తకాన్ని స్థానిక వాసవీ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి ఆనందబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు గ్రామ అభివృద్ధిలో సాయిబాబా తనదైన ముద్ర వేసుకున్నారని వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు బెదరకుండా కార్యకర్తలకు అండగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఇదే స్ఫూర్తితో సమష్టిగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అన్యాయాలు, అరాచకాలకు రెండింతలు బదులు తీర్చుకుంటామని, అధికార పార్టీకి అండగా నిలిచిన అధికారులను కూడా వదిలిపెట్టేదిలేదని తేల్చి చెప్పారు. గ్రామంలో వైసీపీ నాయకులు దోచుకున్నంతా కక్కిస్తామని అన్నారు. ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న చేనేత కార్మికుల సంక్షేమానికి నారా లోకేశ్ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని మరింతగా నేతన్నలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకో జగన్‌రెడ్డిని తరిమికొట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని జగన్‌రెడ్డి శాశ్వతంగా జైలుకు వెళ్లడం ఖాయమని ఆనందబాబు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, బట్టు మల్లికార్జునరావు, కనపర్తి సుందరరావు, జంగం శ్యాంసన్, గొట్టుముక్కల లెనిన్, ఆదిన బసవపున్నయ్య, లెనిన్ పాల్గొన్నారు.


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

ధర్మ పోరాటం చేస్తుంటే అక్రమ కేసులా?

- 1510వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 4: మూడు ముక్కల ఆటతో సీఎం జగన్‌రెడ్డి ప్రజాదరణను కోల్పోయాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు ఆదివారం నాటికి 1510వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అమరావతిని బ్రహ్మాండంగా కడతానన్న సీఎం జగన్‌రెడ్డి మాట తప్పాడన్నారు. అమరావతిని నిర్వీర్యం చేయటంతో పోరాటం మొదలు పెట్టామన్నారు. అందుకు అక్రమ కేసులు బనాయించారన్నారు. అమరావతి ఉద్యమాన్ని అణచి వేయటానికి శత విధాల ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్‌రెడ్డి పాలన.. ఏపీని పూర్తిగా వెనకబాటుకు గురిచేశారన్నారు. అమరావతి రాజధానితో ఎంతో ఉన్నతస్థితికి చేరాల్సిన రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కివెళ్లిందన్నారు. మూడు ముక్కల ఆటతో ఏపీని సీఎం జగన్‌రెడ్డి అధోగతి పట్టించాడన్నాడు. లక్షల కోట్ల సంపద అమరావతి అని స్పష్టంచేశారు. దానిని ఆవిరి చేశాడని ధ్వజమెత్తారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షిబ్లి



రాజకీయ చైతన్య సదస్సులో ప్రసంగిస్తున్న ఫారుఖ్ షిబ్లి

మంగళగిరి, ఫిబ్రవరి 4: పాలక ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తూ వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుఖ్ షిబ్లి అన్నారు. మంగళగిరి పట్టణంలోని ఈద్గా షాదీఖానాలో ఆదివారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఇస్లామిక్ ఫ్రంట్ సహకారంతో రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. అంజుమన్ అధ్యక్షుడు షేక్ అక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో షిబ్లి మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా మంది సిద్ధం.. సిద్ధం అంటున్నారని, వారు సిద్ధమైతే ప్రజలు కూడా సంసిద్ధంగా వున్నారని చెప్పారు. పాలక ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయన్నారు. గతంలో దుల్హన్, విదేశీ విద్య పథకాల నిధులను పొందేందుకు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఎంతగానో కృషి చేసిందని చెప్పారు. సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ అక్రమ్ మాట్లాడుతూ ముస్లింలకు రాజకీయంగా పదవులు కేటాయించిన వారికే తమ మద్దతు వుంటుందన్నారు. ఈ సదస్సులో జిమియత్ ఉలేమా ఏపీ కన్వీనరు మౌలానా హుస్సేన్ మజాహరి, సమితి లీగల్ సెల్ అధ్యక్షుడు ఎండీ సలీం పాషా, మానవతా సందేశ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా మక్బూల్ అహ్మద్ నద్వి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు జిలాని, పవన్‌తేజ తదితరులు

7 నుంచి ఢిల్లీలో హోదా కోసం నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 4: ప్రత్యేక హోదాతో పాటు బడ్జెట్‌లోనూ వివక్షపై ఈనెల 7, 8, 9వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రత్యేక హోదా విద్యార్థి, యువజన జేఏసీ నేత జిలాని పిలుపునిచ్చారు. అరండల్‌పేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. జిలాని మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి స్వార్థ ప్రయోజనాలకు పాకులాడుతున్న వైసీపీకి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మౌర్య శీలం, షేక్ మహమూద్, ప్రదీప్, ఆరిఫ్ బాషా తదితరులున్నారు.


నిందితులతో రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది

10 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్టు

నాదెండ్ల, ఫిబ్రవరి 4: అక్రమంగా హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న కేసుకు సంబంధించి మరో ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పదికిలోల గంజాయితో పాటు రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు. గత నెల 31వ తేదీన సీలేరు నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని నిందితులను యడ్లపాడు మండలంలోని తిమ్మాపురం వద్ద అరెస్టు చేసి సుమారు 107 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఇదే కేసులో పోలీసులకు అందిన సమాచారం మేరకు గణపవరంలోని చవిటిపాలెం అడ్డరోడ్డు వద్ద ముగ్గురిని అరెస్టు చేశారు. వీరు హైదరాబాద్ చింతలబస్తీకి చెందిన కడం ఉల్లాస్, సీలేరుకు చెందిన గొలరి శంకర్‌రెడ్డి, గుణశేఖర్‌లుగా గుర్తించారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు పంపారు.

కంప్యూటర్ సెంటర్‌పై దాడి

- ఇద్దరికి గాయాలు


ధ్వంసమైన కంప్యూటర్ సెంటర్

రెంటచింతల, ఫిబ్రవరి 4: మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం రాత్రి మండలంలోని రెంటాలకు చెందిన ఎన్.చెన్నారెడ్డి, అశోక్‌రెడ్డి, రాజశేఖరరెడ్డితోపాటు మరో 9 మంది పోలీస్‌స్టేషన్ రోడ్డులోని కంప్యూటర్ సెంటర్‌పై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కారంపూడి సీఐ చిన మల్లయ్య, ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న కానుకమాత తిరునాళ్ల సందర్భంగా ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు జెండాలు చేతబూని హడావుడి చేస్తుండడంతో చర్చి పెద్దలైన వడ్లపల్లి భాస్కరరెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి ఆలయ ప్రాంగణంలో అటువంటివి వద్దని వారితో వారించారు. ఈ ఘటనే పెద్దదిగామారి ఆదివారం రాత్రి దాడికి దారితీసింది. అద్దాలు పగలడంతో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. గాయాలైన వారిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భట్టిప్రోలు, ఫిబ్రవరి4: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కోళ్ళపాలెం సమీపంలో చోటు చేసుకుంది. స్టేషన్ రైటర్ సైకం నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరు మండలం గుంటూరుగూడెంకు చెందిన గురిందపల్లి శామ్యూల్ (38) చెట్టు నరికే పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివిధ పనుల నిమిత్తం శనివారం ద్విచక్రవాహనంపై రేపల్లె వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో భార్య ఫోన్ చేయగా రేపల్లె నుంచి కరకట్టపై వస్తున్నానని కోళ్ళపాలెం సమీపంలో ఉన్నానని సమాచారం తెలియజేశాడు. ఆతర్వాత ఫోన్ చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ఓలేరు - పెదపులివర్రు మధ్యలో కోళ్ళపాలెం సమీపంలో కరకట్ట రోడ్డుపై శామ్యూల్ గాయాలపాలై కొనఊపిరితో ఉండడాన్ని గమనించిన స్థానికులు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం చేరవేశారు. 108 వాహనం ద్వారా రేపల్లె వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే శామ్యూల్ మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉండొచ్చని సందేహం వ్యక్తంచేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరుకుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు తెలియజేశారు.


స్వాధీనం చేసుకున్న నాటుసారాతో సెబ్ అధికారులు

30 లీటర్ల సారా స్వాధీనం

మాచర్ల, ఫిబ్రవరి 4: మాచర్ల పట్టణంలో పలుచోట్ల సెబ్ అధికారులు ఆదివారం దాడులు జరిపి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే గేటు వద్ద కొమెర శ్రీనివాసరావు వద్ద 10 లీటర్లు, కూరగాయల మార్కెట్ వద్ద మరో వ్యక్తి వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని వారివురిని అదుపులోకి తీసుకున్నారు.


యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు

ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ సారథివర్మ

తాడేపల్లి, ఫిబ్రవరి 4: నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని, తమ వర్సిటీ పూర్వ విద్యార్థులు తమ కాళ్లమీద నిలబడి వ్యాపారాలు స్థాపించి ఎదగడం సంతోషకరమని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వీసీ సారథివర్మ అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం యువవ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ చెన్నై, బెంగుళూరులలో నూతనంగా వ్యాపారాలు స్థాపించిన కేఎల్‌యూ పూర్వ విద్యార్థులందరూ పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సుకు పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య అధ్యక్షత వహించారు. సదస్సులో అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ కాకాని మాట్లాడుతూ కేఎల్‌యూ ప్రాంగణంలో ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సౌకర్యాలకు నాంది పలకడం జరిగిందని, నూతన వ్యాపారాలు స్థాపించాలనే ఆలోచనకు బీజం పడిందని చెప్పారు. నూతన వ్యాపారాలు స్థాపించాలనే విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోవీసీలు డాక్టర్ వెంకటరామ్, ప్రసాద్, రిజిస్ట్రారు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సీహెచ్ శ్రీకావ్య, సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


విజయ్ (ఫైల్)

చేబ్రోలు, ఫిబ్రవరి4: చేబ్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మోదుకూరు గ్రామానికి చెందిన చల్లాపల్లి విజయ్ (23) గుంటూరులో పని చేస్తున్నాడు. ఆదివారం పనిముగించుకొని ద్విచక్రవాహనంపై మోదుకూరు బయల్దేరిన విజయ్ సెయింట్ మెరీస్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. విజయ్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనగా కింద పడిపోయిన విజయ్‌పై వెనక నుంచి వస్తున్న లారీ ఎక్కడటంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రైలుఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

దుగ్గిరాల, ఫిబ్రవరి 4: రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు(60) మృతిచెందాడు. విజయవాడ వైపు నుంచి వస్తున్న కొచ్చువేలీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22647) ఢీకొని వ్యక్తి మృతదేహం ఆదివారం సాయంత్రం దుగ్గిరాల రైల్వేగేటు వరకూ ఇంజన్ ముందుభాగాన వేలాడుతూ వచ్చింది. మోరంపూడి వద్ద గుర్తించిన రైల్వేసిబ్బంది దుగ్గిరాల స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ప్రమాద ఘటన చిలువూరు వడ్లపూడి మధ్య జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు.


ఈత కొడుతున్న స్విమ్మర్లు

ఉత్సాహంగా ఈత పోటీలు

తాడేపల్లి, ఫిబ్రవరి 4: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24వ కృష్ణానది రివర్ క్రాస్ రాష్ట్రస్థాయి ఈత పోటీలను ఆదివారం నిర్వహించారు. విజయవాడ దుర్గాఘాట్ నుంచి సీతానగరం వరకు జరిగిన ఈత పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి మొత్తం 367 మంది పురుషులు, 66 మంది మహిళలు పాల్గొన్నారు. ఆరు కేటగిరీలుగా ఈతల పోటీలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఈత పోటీలను దుర్గా ఘాట్ వైపు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటి మాజీ ఛైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్, దివీస్ లాబొరేటరీ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ దివి మధుసూదన రావు, లైలా గ్రూప్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మ ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి కరకట్ట వద్ద వున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ వచ్చే ఏడాది 25వ కృష్ణానది రివర్ క్రాస్ ఈత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళా స్విమ్మర్లు పోటీలలో పాల్గొనడం విశేషమన్నారు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ సెలక్షన్ కమిటి మాజీ ఛైర్మన్ ఎంఎస్‌కె ప్రసాద్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విజయవంతంగా ఈత పోటీలను నిర్వహించడమే కాక ప్రతి ఏడాది సమ్మర్ కోచింగ్ క్యాంప్ ద్వారా ఉచితంగా ఈత నేర్పడం విశేషమన్నారు. మానసిక ఉల్లాసానికి దేహదారుఢ్యానికి ఈత ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దివి మధుసూదనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఒక స్వచ్ఛమైన రిజర్వాయర్ వున్న నీళ్లలో ఈత పోటీలు ఎట్టి అడ్డంకులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అసోసియేషన్ వారు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి ఎం ఎల్ నరసరాజు, కన్వీనర్ అమ్మిరెడ్డి రామిరెడ్డి, కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


బహుమతి గ్రహీతలతో మాజీ ఎంపీ గంగరాజు, ఎంఎస్‌కే ప్రసాద్

గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో దేవాంగులు

- దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు
- మంగళగిరిలో ఆత్మగౌరవ ర్యాలీ



ఆత్మగౌరవ ర్యాలీలో పాల్గొన్న దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: ఇచ్ఛాపురం నుంచి ధర్మవరం వరకు ప్రతి నియోజకవర్గంలో దేవాంగుల ఓట్లు పది వేల నుంచి 15 వేల వరకు వున్నాయని, వీటి ద్వారా ఆయా రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్నామని ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీకే నాగరాజు తెలిపారు. ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. చినకాకాని ఎన్నారై జంక్షన్‌లోని నేతన్న విగ్రహం వద్ద నుంచి పాతమంగళగిరి మీదుగా ఆర్‌ఆర్ కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది జనాభా వున్న దేవాంగులకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రాజకీయంగా బలోపేతం అయితేనే దేవాంగుల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అమరావతి సంఘం అధ్యక్షుడు బల్ల వెంకటరమణ మాట్లాడుతూ దేవాంగులు రాజకీయ చైతన్యం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జా హేమలత, నేతలు బీరక ప్రసాద్, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, నక్కిన విజయలక్ష్మి, ఏరాసు అరుణ్‌బాబు, ఆనెం ఆనంద్‌కుమార్, పులి రామచంద్ర, గిద్దలూరి ఎర్రస్వామి, సజ్జా వెంకటేశ్వరరావు, అల్లక సిరిప్రసాద్, నక్కిన దొరబాబు, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.38
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	124, 133,144
చికెన్ విత్ స్కిన్	234.00
చికెన్ స్కిన్ లెస్	244.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

ఎన్నికల కోసమే జగన్‌రెడ్డి డీఎస్సీ డ్రామాలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే జగన్‌రెడ్డి డీఎస్సీ పేరుతో డ్రామాలకు తెరతీశాడని, నిరుద్యోగులను మరోసారి మోసంచేసేందుకు సిద్ధమయ్యాడని టీడీపీ గుంటూరుజిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన జగన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా చేసిందేమీ లేదన్నారు. 51వేల టీచర్ పోస్టులు కాళీగా ఉంటే 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడంలో అర్థమేంటని ప్రశ్నించారు. జగన్ చేతగాని తనంతో తలెత్తిన నిరుద్యోగసమస్య కారణంగా రాష్ట్రంలో 1745మంది యువకులు బలవన్మరణం పాలయ్యారన్నారు. రాష్ట్రాన్ని గంజాయిమయం చేసేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, మేళం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి మొదలు జైలు వరకు సిద్ధంగా జగన్

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సిద్ధమంటున్న సీఎం జగన్ ఆ తరువాత ఓటమి మొదలు జైలు వరకు అన్నింటికీ సిద్ధంగా ఉండా లని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు. గుంటూరు పశ్చిమలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డిని సాగనంపడానికి తాము సిద్ధంగానే ఉన్నా మని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడే ప్రజలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చిన విషయాన్ని మన్నవ గుర్తుచేశారు. బాబాయిని చంపించి, తల్లి, చెల్లిని బయటకు గెంటించి, ఇప్పుడు తాను ఒంటరినని మొసలి కన్నీళ్లు కార్చుతున్న జగన్ విపరీత ప్రవర్తనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. అభిమన్యుడిని కాదు అర్జునుడని అని సొంత డబ్బా కొట్టుకుంటున్న జగన్‌కు అర్జునుడి పేరు తలవడానికి అర్హత లేదని మన్నవ అన్నారు.



జేఏసీగా ఏర్పడిన కాపు ఉద్యోగ సంఘాల నాయకులు

కాపు ఉద్యోగులు సంఘటితం కావాలి

● టీబీకే జేఏసీ కన్వీనర్ రాము ● కాపు ఉద్యోగులతో జేఏసీ ఆవిర్భావం

గుంటూరు, ఫిబ్రవరి 4: అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం కాపు ఉద్యోగులు సంఘటితం కావాలని తెలగ, బలిజ, కాపు (టీబీకే) కన్వీనర్ దాసరి రాము పిలుపునిచ్చారు. గుంటూరు అరండల్‌పేటలోని ది ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధశాఖలకు చెందిన కాపు ఉద్యోగులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల్లో సంఘటితం లేకపోవటంతోనే ప్రస్తుతం కాపు ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో నాలుగు తీర్మానాలు చేశారు. అన్ని శాఖల్లోని కాపు ఉద్యోగులు సమన్వయంగా ముందుకు సాగాలని తీర్మానం చేశారు. జేఏసీ రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ స్థాయిలో నిర్మాణం కావాలన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో కాపు జేఏసీ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో రిటైర్డ్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, కాపు నాయకులతో జేఏసీ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కాపు ఉద్యోగ సంఘాల నాయకులు సోమరౌతు రామకృష్ణ, పోల్లా నారాయణ, డీ.శ్రీనివాస్, పీ.పోలేశ్వరరావు, జీ. వేళాంగిరాజు పలువురు నాయకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డొక్కా, వనమా నరేంద్ర తదితులు

నగరానికి చేరుకున్న ఈశ్వరీదేవి మాత పీఠం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: కందిమల్లయ్యపాలెం, ఈశ్వరిదేవి మాత మఠం, ఆస్థాన పీఠం ధార్మిక పర్యటనలో భాగంగా ఆదివారం గుంటూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా అరండలపేటలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో పీఠాధిపతులు వీర శివకుమార్ స్వాముల వారిచే పూజలు, అభిషేకాలు, హోమా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు, జనసేన నేత నేరెళ్ళ సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ పాల్గొని ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈశ్వరి మాత పీఠం నగరానికి రావడం అరుదైన విశేషమని, ఈ అవకాశాన్ని కల్పించిన నిర్వాహకులను అభినందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై

అనుకూల తీర్మానం చేయాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: నేటి నుంచి రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని సీఎం జగన్‌కు స్వర్ణాంధ్రా ఏమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబుమాదిగ విజ్ఞప్తి చేశారు. కాకానిరోడ్డులోని సంఘ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కడప ఎంపీగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కేంద్రానికి లేఖ రాశారని, అలాగే వైసీపీ ప్లీనరీ సమావేశంలో ఈ అంశానికి మద్దతు తెలిపారన్న విషయాన్ని గుర్తుచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్ తదితరులు

సాంకేతిక రంగంతో ఉపాధి అవకాశాలు

● ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు

గుంటూరు, ఫిబ్రవరి 4: ఆధునిక మానవ జీవన వేగానికి అనుగుణంగా సాంకేతిక అవసరాలను అందించే ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరిశ్రమల రంగంలో అనేక మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, గుంటూరు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం ప్రోగ్స్ కంపెనీ నేతృత్వంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఆకంపెనీ రిసోర్స్‌పర్సన్ వారణాసి పవన్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమలు, వాహనాల యాంత్రీకరణకు, క్వాలిటీ కంట్రోల్, వస్తు రవాణా తదితర రంగాల్లో ఐవోటీ సాంకేతికతను ఇటీవల వాడుతున్నారన్నారు. హాజరైన విద్యార్థులు ఐవోటీ పరికరాలతో ప్రత్యక్షంగా పనిచేస్తూ, దానికి సంబంధించిన టెక్నాలజీని ఎంతో ఆసక్తితో నేర్చుకున్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు రాజ్యలక్ష్మీ, కిరణ్‌కాంత్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ విభాగాధిపతి రమాసుందరి, శ్రీవల్లి, గోమతి, కిరణ్మయి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డి



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న నసీర్, పక్కన బీసీ నేతలు

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

● జయహో బీసీ.. బీసీల ఆత్మీయ సమావేశం

గుంటూరు,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): బీసీలను జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచాడని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ విమర్శించారు. నెహ్రూనగర్ శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహించారు. ఆదేవిధంగా గౌడ, చేనేత, ముదిరాజ్, కృష్ణ బలిజ వర్గాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నందం అబద్ధయ్య, తాత జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు.నసీర్ మాట్లాడుతూ టీడీపీ బీసీలు వెన్నెముక అని, ఆనాడు ఎన్టీఆర్ బీసీలకు ఎన్నో ఉన్నత పదవులు కల్పించారని గుర్తుచేశారు. 'రాజ్యాధికారం బీసీల హక్కు' అనే నినాదంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు 24 శాతంగా వున్న స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌ను అనంతరం చంద్రబాబునాయుడు 34 శాతానికి పెంచారని అన్నారు. అయితే జగన్‌రెడ్డి దాన్ని 24 శాతానికి తగ్గించి బీసీల ప్రాధాన్యాన్ని దెబ్బతీశాడన్నారు. నేడు ఊరూరా బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు టీడీపీ వెంటే వున్నారన్న విషయాన్ని వచ్చే ఎన్నికల్లో చాటి చెప్పబోతున్నారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించింది బీసీల కోసమేనన్నారు. తాతా జయప్రకాశ్ మాట్లాడుతూ కల్లుగీత, మద్యం అమ్మకాలపై ఆధారపడిన గౌడ కార్మికుల్ని జగన్‌రెడ్డి నిలువునా దగా చేశాడన్నారు. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక బీసీల పార్టీ టీడీపీయేనని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రానున్నరోజుల్లో చంద్రబాబును సీఎంని చేసుకునేందుకు బీసీలు సంసిద్ధమయ్యారన్నారు. సమావేశంలో ఈశ్వరరావు, వెంకటరమణ, సుబ్బారావు, మణి, రాజు, కృష్ణమూర్తి, అశోక్, వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. బత్తిన శంకర్, వంగర ఏడుకొండలు, గొడుగు శంకర్, గాలి సతీశ్, గుడిపల్లి వాణి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి ఎంపీ బాలశౌరి

● జనసైనికులతో నగరంలో భారీ ర్యాలీ

గుంటూరు, ఫిబ్రవరి 4: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసైనికులతో నగరంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరేందుకు గుంటూరు కృష్ణనగర్‌లోని కార్యాలయం నుంచి కార్యకర్తలతో భారీ ర్యాలీగా కదిలివెళ్లారు. కార్లు, ద్విచక్రవాహనాలు, జనసైనికుల కోలాహలం మధ్య ర్యాలీ సాగింది. ముందుగా నాజ్‌సెంటర్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బాలశౌరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణనగర్ కార్యాలయం నుంచి జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఆ పార్టీ నేత బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ జనసైనికులతో కలిసి ర్యాలీగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో ఎంపీ బాలశౌరి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు.



నగరంలో జనసైనికులతో ఎంపీ బాలశౌరి భారీ ర్యాలీ



ఆంజనేయస్వామి ఆలయంలో ఎంపీ బాలశౌరి దంపతుల పూజలు

పార్టీ ఆదేశానుసారం పనిచేస్తా: బాలశౌరి

పార్టీ ఆదేశానుసారం చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. పార్టీలో ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని స్పష్టం చేశారు.

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 4: జిల్లాలో నేటినుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఇంటర్ బోర్డు పకడ్బందీ ఏర్పాట్లుచేసింది. తొలుత వృత్తివిద్యాకోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20వరకు, జనరల్ (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు 11 నుంచి 20 వరకు విడతల వారీగా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం మొత్తం 120 పైగా కేంద్రాల్ని సిద్ధం చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తూకంలో తేడాలపై 10 కేసులు నమోదు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: లీగల్ మెట్రాలజీ, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని బియ్యం, చేపలు, నాటుకోళ్లు విక్రయించే దుకాణాలపై ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బియ్యం దుకాణాల్లో 25 కేజీల బస్తాకు 1కేజీ తగ్గడంపై 5 దుకాణాలపై, అలాగే చేపలు, నాటు కోళ్ల కేజీకి 200 నుంచి 400 గ్రాముల వరకు తేడాలు ఉండటంతో మరో 5 దుకాణాలపై మొత్తం 10 కేసులు నమోదుచేశారు. తూకంలో తేడాలున్నట్టు వినియోగదారులు గమనిస్తే 0863-2223202 అనే నెంబరకు ఫిర్యాదు చేయాలని లీగల్ మెట్రాలజీ తనిఖీ అధికారి సునీల్ తెలిపారు. తనిఖీల్లో రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు హరిబాబు, కవిత, లీగల్‌మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.



సీనియర్ నటి పూర్ణిమను సత్కరిస్తున్న అతిథులు, పాల్గొన్న నిర్వాహకులు

సీనియర్ నటి పూర్ణిమకు

ఏఎన్ఆర్ శతజయంతి పురస్కారం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఆలాపన కల్చరల్ అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్సవాల్లోభాగంగా సీనియర్‌నటి పూర్ణిమకు ఏఎన్ఆర్ శతజయంతి పురస్కార ప్రదానంచేశారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది కొల్లా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయాధికారి వైవీఎస్‌బీజీ పార్థసారథి, వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షులు డీ.సునీత తదితరులు పూర్ణిమను ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది.

11న 'స్వరరత్న' పురస్కారాలు ప్రదానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: పద్మశ్రీఘంటసాల 50వ వర్థంతిని పురస్కరించుకుని కళాదర్బార్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 11న స్థానిక ఇన్నర్ రింగురోడ్డు, శిల్పారామంలో విశిష్టగాయని, గాయకులకు 'స్వరరత్న' పురస్కారాలు అందజేయనున్నట్టు కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. అదేరోజున ఉదయం 11 గంటలకు నాజ్‌సెంటర్, ఘంటసాల విగ్రహం వద్ద వర్థంతి సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డి బాలస్వామి, రాజశేకర్, చంద్రబాబు, మిరియాలప్రసాదు, పురుషోత్తమ ప్రసాదు, సుధీర్‌బాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



కనుమూరికి సన్మాన పత్రం అందజేస్తున్న హెనీ క్రిస్టినా, వసంత రాయుడు

మచ్చలేని అధికారి కిషోర్ కుమార్

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 4: సర్వీసులో మచ్చలేని అధికారిగా పేరొందిన మంచి మనిషి కనుమూరి కిషోర్‌కుమార్ అని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. ఆదివారం గుంటూరు జడ్పీ సమావేశ మందిరంలో మండలపరిషత్ పరిపాలన అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన కిషోర్‌కుమార్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన హెనీక్రిస్టినా వెండి, బంగారం కంటే మంచి పేరు సాధించాలన్న సూక్తిని కిషోర్‌కుమార్ అక్షరాల సార్థకం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో విశిష్ఠ అతిథిగా పాల్గొన్న జడ్పీ సీఈవో వసంతరాయుడు మాట్లాడుతూ సమాజంలో పది మందికి, విధి నిర్వహణలో తోటి సిబ్బందికి ఆదర్శప్రాయుడు కిషోర్‌కుమార్ అని కీర్తించారు. ఈ తరంలో ఆయనలాంటి వ్యక్తులు ఎంతో అరుదని అన్నారు. సభకు ఏపీపీఆర్ ఎంఈఏ రాష్ట్రశాఖ గౌరవాధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఏపీపీఆర్ ఎంఈఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూచిపూడి మోహన్‌రావు సభా పరిచయం చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి జే.మోహన్‌రావు, జిల్లా ప్రజా పరిషత్ గణాంకాధికారి జీ.శ్రీనివాసరావు, బెల్లంకొండ ఎంపీపీ మీరయ్య, జడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ సాంబిరెడ్డి, జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీవీ ప్రసాదు, పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

పంట రుణాలను మాఫీ చేయాలి

● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి4: నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో సాగుదారుల పంటరుణాలను మాఫీచేస్తున్నట్లు సీఎం ప్రకటన చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాదు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరుజిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై రూ.2.45 లక్షల అప్పు ఉందని, ఈనేపథ్యంలో పంట రుణాలను, అప్పులను మాఫీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా కరువు, తుఫానులతో నష్ట పోయిన రైతులకు పంట నష్టపరిహారంతో పాటు, పంటల బీమా పథకాన్ని సత్వరం వర్తించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. సమావే శంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవృత్తి మహోన్నతమైనది

● భాష్యం మెడెక్స్ పూర్వ విద్యార్థుల సమావేశంలో అతిథులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 4: వైద్యవృత్తి మహోన్నతమైనదని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా వైద్యులు పని చేయాలని జీజీహెచ్ కార్డియాలజిస్టు ఆచార్య ఎస్.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక చంద్రమౌళినగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమమైన వైద్యులకు ఉండవలసిన ముఖ్య లక్షణాలు లోకజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు కలిగి ఉండటం, రోగుల పట్ల కరుణ చూపటం అని విద్యార్థులకు సూచించారు. మరో అతిథి జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరాలజీ, న్యూరాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి బిందుసర్మద మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో ఉన్నతమైనదని గుర్తించాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు ఉత్తమమైన వైద్యులుగా రాణించడానికి భాష్యం మెడెక్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు షైఖేల్ రాజ్, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



భాష్యం రామకృష్ణను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



బదిలీపై వెళుతున్న డిప్యూటీ కలెక్టర్లను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ, కమిషనర్

డిప్యూటీ కలెక్టర్లకు ఘనంగా వీడ్కోలు

గుంటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కారణంగా జిల్లా నుంచి బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్‌స్థాయి అధికారులకు జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీఆర్‌వో చంద్రశేఖర్‌రావు, డ్వామా పీడీ వెంకటశివరామిరెడ్డి, నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ కే.లక్ష్మి శివజ్యోతి బదిలీపై ఇతర జిల్లాలకు నియమితులయ్యారు. ఈ ముగ్గురిని ఘనంగా సత్కరించి వారు జిల్లా అభివృద్ధికి వారందించిన సేవలను కలెక్టర్ ప్రశంసించారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి గణియా, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, ఎస్‌డీసీ కే స్వాతి, ఆర్‌డీవో పఠ శ్రీఖర్, జడ్పీ సీఈవో వసంతరాయుడు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

● మేయర్ మనోహర్ నాయుడు

● 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 4: పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా నగర సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తున్నామని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు అన్నారు. మణిపురం వంతెన నుండి జాతీయరహదారి వైజంక్షన్ వరకు సుమారు 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్డుని నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) నిధుల నుంచి రూ.3 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులను ఆదివారం మంగళదాస్‌నగర్ వద్ద కమిషనర్ కీర్తిచేకూరి, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాలతోకలిసి మేయర్ శంఖుస్థాపనచేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రస్తుతం నూతన బీటీ రోడ్డును 15 రోజుల గడువులోగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధంచేశామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఈ రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎస్ఈ, ఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్య క్రమంలో వివిధ శాఖల అధికారులు స్థానిక కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి రజిని

మా ప్రభుత్వంలో కేన్సర్‌కు ఆన్సర్ ఉంది

● ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 4: గతంలో కేన్సర్ వ్యాధి సోకితే మరణమే శరణ్యమని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కేన్సర్ రోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తూ వారి ప్రాణాలు కాపాడుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేన్సర్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ కేన్సర్ చికిత్సల కోసం గుంటూరు, విజయవాడ, అనంతపురం, కాకినాడ వైద్య బోధన ఆసుపత్రుల్లో 4 లీనియల్ యాక్సిలరేటర్ మెషిన్లు ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మీ, వైద్యులు పాల్గొన్నారు.



జనంలోకి జనసేన కార్యక్రమంలో నేరెళ్ల సురేష్

జనసేన, టీడీపీ పొత్తుతో అరాచక పాలన అంతం

● జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ వెల్లడి

గుంటూరు, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అరాచక పాలన నుంచి ప్రజలు విముక్తుల్ని చేయడమే ధ్యేయంగా జనసేన, టీడీపీ పొత్తు అంకురించిందని జనసేన పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ వెల్లడించారు. జనంలోకి జనసేన, సమస్యలపై సమర భేరి కార్యక్రమాల్లో భాగంగా 15వ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో ఆదివారం పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. తొలుత జనసేన పార్టీ జెండాను నేరెళ్ల సురేష్‌తో పాటు పార్టీ కార్పొరేటర్లు యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మీ దుర్గ, జనసేన జిల్లా ఉపాధ్యక్షురాలు బిట్రగుంట మల్లిక ఆవిష్కరించారు. అనంతరం పార్టీ డివిజన్ కార్యాలయాన్ని స్థానిక వీరమ మహిళల చేతుల మీదుగా నేరెళ్ల సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్థ సీఎం చేతికి చిక్కి అభివృద్ధికి దూరమైన రాష్ట్రానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వమే శ్రీరామ రక్షణ అని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా డివిజన్ జనసేన అధ్యక్షుడు జగన్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు జనసేన పార్టీలో చేరారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వీరికి మెడలో పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, పాలక వర్గ సభ్యులు

సాధించిన ప్రగతిని దాతలకు వివరించాలి

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్

● ఆర్వీఆర్‌జేసీ విద్యార్థినులకు ఉపకారవేతనాల పంపిణీ

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి4: తాముసాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు ఫోన్, మెయిల్, లేఖలద్వారా వివరించాలని, అప్పుడే దాతలు మరింతసాయం చేయడానికి ముందుకొస్తారని కమ్మజన సేవసమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లిరమేష్‌లు అన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ కేజేఎస్ఎస్ ఆవరణలో ఆర్వీఆర్‌జేసీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద, ప్రతిభ వంతులైన 25 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున తెనాలికి చెందిన దాత రావి హనుమంతు రావు చేతులమీదగా ఉపకార వేతనాలు అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ.. తెనాలికి చెందిన ప్రవాస భారతీయులు రావి మానస్‌వరుణ్ ఇచ్చిన రూ.5 లక్షలసాయాన్ని విద్యార్థినులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. దాతల తోడ్పాటు పొందిన విద్యార్థినులు కూడా భవిష్యత్తులో సాయంచేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. దాత రావి హనుమంతురావు మాట్లాడుతూ ప్రతిభను ఇలాగే కొనసాగిస్తే వచ్చే మరో రెండు సంవత్సరాలు కూడా ఉపకార వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్వీఆర్‌జేసీ కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, సమితి ఉపాధ్యక్షులు వడ్లమూడి నాగేంద్రం, పాలక వర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, మైనేని సీతారామయ్య, తేళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు

ఇద్దరు వ్యక్తుల మధ్యే కాదు, రెండు దేశాల మధ్య మిత్రత్వం దీర్ఘకాలం కొనసాగాలంటే భావసారూప్యత ఎంతో అవసరం. విపత్కర కాలంలో ఒకరికి ఒకరు వెన్నుదన్నుగా నిలవడం మరీ ముఖ్యం. ఫ్రాన్స్-భారత్‌ల మధ్య సుదీర్ఘ స్నేహ సంబంధాలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

1980ల్లో మిరాజ్ యుద్ధ విమానాలను అందించడం మొదలు, 1982లో భారత్‌కు అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా సహకరించనప్పుడు, ఆ స్థానంలో ఫ్రాన్స్ భారత్‌కు అణు ఇంధన సరఫరా చేయడం వరకూ ఒక సహకార ధోరణి కనిపిస్తుంది. అనంతరం 1998లో భారత్ అణు పరీక్షలు జరిపినప్పుడు అమెరికా వంటి అగ్ర దేశాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా, ఫ్రాన్స్ మాత్రం ఆ పని చేయకుండా తన మిత్రత్వాన్ని చాటుకుంది.

ఇలాంటి సయోధ్య, స్నేహబంధం ఇటీవల మరోసారి రుజువైంది. తొలుత గత జులైలో ప్రధాని మోదీని ఫ్రాన్స్ తమ 'బాస్టిల్ డే' పరేడ్‌కు ఆహ్వానించగా, ఈయేటి గణతంత్ర దినోత్సవ ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్‌ను భారత్ ఆహ్వానించింది. ఈ పర్యటనల సందర్భంగా అనేక కీలక ఒప్పందాలు కుదిరిన నేపథ్యంలో, ఇరుదేశాల మధ్య సుదీర్ఘ స్నేహబంధం, నేటి ప్రపంచ పరిస్థితుల్లో అది మరింత బలపడాల్సిన ఆవసరం, సవాళ్లు చర్చనీయమైనాయి.

● ఇండో-ఫ్రాన్స్ సుదీర్ఘ ద్వైపాక్షిక బంధం

బహుళ ధ్రువ ప్రపంచం దిశగా భావసారూప్యం: ఫ్రాన్స్-భారత్ రెండూ ఎంతో భావసారూప్యం గల దేశాలు. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో అమెరికా, రష్యా కూటములపరంగా ప్రపంచం చీలిపోయిన సందర్భంలోనూ, భారతదేశం ఏ కూటమివైపు మొగ్గుచూపకుండా అలీన(నాన్ ఎలైన్‌మెంట్) ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించింది. అదేవిధంగా ఫ్రాన్స్ అమెరికాకు మిత్ర దేశమే అయినా కూడా తటస్థ వైఖరినే అవలంబించింది. అదేవిధంగా ఇరాన్‌పై అమెరికా దాడి సమయంలోనూ, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాలు అమెరికాకు సహకరించినా, ఫ్రాన్స్ మాత్రం ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకించింది. భారత్ కూడా ఇలాంటి దాడులను ఎప్పుడూ సమర్థించలేదు. ఇటీవల రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ పరిస్థితుల్లో కూడా రెండు దేశాలూ ఏ దేశానికీ మద్దతుగా నిలువలేదు. యుద్ధ విరమణనే కోరాయి. దాడులను ఖండించాయి.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో రష్యా, చైనా ఒక కూటమిగా, అమెరికా, పాశ్చాత్య దేశాలు మరోవైపు మోహరిస్తూ ఉన్న నేపథ్యంలో భారత్-ఫ్రాన్స్ తటస్థ కూటమిగా బహుళ ధ్రువ ప్రపంచం ఆవిష్కారానికి ఆస్కారం ఉంది. గ్లోబల్ సౌత్‌కు భారత్ నేతృత్వం వహిస్తూ, యూరోపియన్ యూనియన్‌కు ఫ్రాన్స్ ప్రాతినిధ్యంతో రెండు శక్తులనూ సమన్వయం చేయడం ద్వారా ఒక తటస్థ బహుళ ధ్రువ ప్రపంచం వైపు పయనించవచ్చు.

వ్యూహాత్మక సంబంధాలు: తొలినుంచే రెండు దేశాల మధ్య ఉన్న సుహృద్భావ వాతావరణం 1998లో వీటిమధ్య 'స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్(వ్యూహాత్మక భాగస్వామ్య) ఒప్పందానికి దారితీసింది. రక్షణ, భద్రతా రంగాల్లో సహకారం, అంతరిక్ష పరిశోధనల పరంగా, పౌర అణు ఇంధనపరంగా సహకారం ఈ ఒప్పందంలోని కీలక అంశాలు. భారతదేశ భౌగోళిక వ్యూహాత్మకత దృష్ట్యా ఫ్రాన్స్ తన ఇండో పసిఫిక్ ప్రాంతమైన 'రీ యూనియన్ ఐలాండ్'లో భారత వాయుసేనకు స్థావరం ఇవ్వడమే కాక, 2020లో 'ఇండియన్ ఓషన్ కమిషన్'లో భారత్‌కు అబ్జర్వర్‌గా స్థానం దక్కడానికి ఫ్రాన్స్ సహకరించింది. తద్వారా భారత్‌కు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎంతో వ్యూహాత్మక ప్రయోజనాలు చేకూరాయి.

అదేవిధంగా ఇండో పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత కార్యకలాపాలు, సమ్మిళిత ప్రయోజనాలు, పరస్పర సహకారానికిగానూ ఏర్పడిన 'ఇండియా-ఫ్రాన్స్-ఆస్ట్రేలియా ట్రై లేటరల్ డైలాగ్'లో ఈ రెండు దేశాలూ కీలకపాత్ర పోషిస్తున్నాయి.




భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాల 25వ వార్షికోత్సవం సందర్భంగా తమ బంధాన్ని 2047 వరకూ పొడిగించుకొనేందుకు 'హారిజన్ ఆఫ్ 2047 అగ్రిమెంట్' గత సంవత్సరం జరిగింది. దీంతో 1947లో భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రారంభమైన దౌత్య సంబంధాలకు 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తవగా, 1998లో ఏర్పర్చుకున్న వ్యూహాత్మక సంబంధాలకు 50 ఏళ్లు పూర్తవుతాయి.

రాజకీయ మద్దతు: భారత్‌కు ఐక్యరాజ్యసమితి శాశ్వత సభ్యత్వం ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన తొలి శాశ్వత సభ్య దేశం ఫ్రాన్స్. అంతేకాక మిసైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజీమ్(ఎంటీసీఆర్), వాస్సెనార్ అగ్రిమెంట్, ఆస్ట్రేలియా గ్రూప్‌లలో భారత ప్రాతినిధ్యానికి కూడా ఫ్రాన్స్ ఇతోధికంగా సహకరించింది. జమ్మూ కాశ్మీర్ అం శంలో ఫ్రాన్స్ భారత్‌కు మద్దతు ఇవ్వడమే కాదు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కూడా ఖండిస్తూ వస్తోంది. అంతేకాక చైనాకు దీటైన ప్రత్యామ్నాయ శక్తిగా భారత్‌కు తన మద్దతును తెలుపుతూ వస్తోంది.

ఆర్థిక సంబంధాలు: ఇరుదేశాల మధ్య ఇటీవలకాలంలో విస్తృతస్థాయిలో వాణిజ్యం జరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇరుదేశాల మధ్య 13.4 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది.

భారత్ నుంచి ఫ్రాన్స్‌కు ఏడు బిలియన్ డాలర్లపైగా ఎగుమతులు పెరిగాయి. అదేవిధంగా భారతదేశంలో ప్రత్యక్ష పెట్టుబడుల్లో 1.64 శాతం సమకూర్చుతూ భారత్‌లో విదేశీ పెట్టుబడులపరంగా ఫ్రాన్స్ 11వ స్థానంలో నిలిచింది. భారత్‌లో ఫ్రాన్స్‌కు చెందిన దాదాపు వెయ్యి సంస్థలు(ఎస్టాబ్లిష్‌మెంట్స్) 20 బిలియన్ డాలర్ల టర్నోవర్ కలిగి మూడు లక్షలమందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అదేవిధంగా భారత్‌కు చెందిన 150 కంపెనీలు ఫ్రాన్స్‌లో ఏడువేలమందికి ఉపాధినిస్తున్నాయి. ఇండో-ఫ్రాన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ కమిటీ(ఏఈటీసీ) ద్వారా భారత్-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల పెరుగుదలకు, వ్యాపార అవరోధాల పరిష్కారానికి కృషి జరుగుతోంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచి పేజీలో)

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మౌర్య సామ్రాజ్యం

భారతదేశంలో తొలిసారి గొప్ప పరిపాలనను అందించిన వారు మౌర్యులు. వీరు విశాల భారతదేశాన్ని ఆక్రమించారు. వాయువ్యంలో గ్రీకులను, మగధలో నంద వంశస్థులను నిర్మూలించారు. 'పాటలీపుత్రం' రాజధానిగా క్రీ.పూ.322 నుంచి క్రీ.పూ.185 వరకు పరిపాలించారు.

మౌర్యుల చరిత్రకు ఆధారాలు

మౌర్యుల చరిత్రకు అనేక సాహిత్య, పురావస్తు ఆధారాలతోపాటు గ్రీకు, చైనా చరిత్రకారుల రచనలు లభించాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రం: సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం మౌర్యుల పరిపాలన విధానాలు, చంద్రగుప్తుని రాజకీయ, రాజనీతి సిద్ధాంతాలను తెలియజేస్తుంది.

విశాఖదత్తుని ముద్రారాక్షసం: నందవంశంలోని చివరి రాజైన ధననందున్ని చంద్రగుప్త మౌర్యుడు ఓడించి, వారి రాజ్యాన్ని ఆక్రమించుకున్నట్లు రాసి ఉంది. ఈ గ్రంథంలో విశాఖదత్తుడు మౌర్యులను 'హీనకులస్థులు'గా పేర్కొన్నాడు.

హేమచంద్రుని పరిశిష్టపర్వణ్: ఈ గ్రంథంలో చంద్రగుప్త మౌర్యుడు జైనమతంలోని 'దిగంబరశాఖను తన గురువైన 'బద్రబాహు' ద్వారా స్వీకరించిన విధానం రాసి ఉంది.

విదేశీ గ్రంథాలు: గ్రీకు రాయబారి మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో పాటలీపుత్రంలోని పరిపాలన, సమాజంలోని మతం, స్త్రీల దుస్థితి, ఆర్థిక రంగాల గురించి రాశాడు. చైనా యాత్రికుడు ఫాహియాన్ గుప్తు ల కాలంలో భారతదేశం సందర్శించినప్పటికీ మౌర్యుల కాలం నాటి సామాజిక విధానాన్నే వివరించాడు.

అశోకుని శిలాశాసనాలు: భారతదేశంలో తొలిసారిగా అశోకుడు అనేక శాసనాలు వేయించాడు. బ్రాహ్మ లిపి, పాళి భాషలో అనేక శాసనాలున్నప్పటికీ, సంస్కృతంలో మాత్రం చెక్కించలేదు. దీనికి ముఖ్య కారణం ఆ కాలంనాటి ప్రజల వాడుక భాష 'పాళి' కావడం. సార్‌నాథ్, మస్కి, రుమిందై, కౌశాంబి, రాయలసీమలోని కర్నూలులో ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద అశోకుని శాసనాలు లభించాయి.

మౌర్యుల రాజకీయ చరిత్ర(322 - 185 క్రీ.పూ.)

మౌర్య వంశస్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. అలెగ్జాండర్ సేనాని సెల్యూకస్ నికేటర్‌ను ఓడించి ప్రస్తుత ఆఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్- ఇరాన్ సరిహద్దులను ఆక్రమించాడు. గ్రీకులు చంద్రగుప్త మౌర్యున్ని 'యాంద్రకోటస్'గా పేర్కొన్నారు. చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులతో వివాహ సంబంధాలు కుదుర్చుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా వారి నుంచి అరకోషియా(కాందహార్), కాబూల్, గెడోసియా(బెలూచిస్థాన్), మీరట్ మొదలైన ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు. చివరికి చంద్రగుప్త మౌర్యుడు జైనమతం స్వీకరించాడు. కర్ణాటకలోని మైసూర్ వద్ద గల చంద్రగిరి పర్వతంపై 'సల్లేఖన' వ్రతం(ఉపవాస దీక్ష) చేపట్టి మరణించినట్లు జైన గ్రంథాల్లో ఉంది.

బిందుసారుడు(297- 273 క్రీ.పూ.): చంద్రగుప్త మౌర్యుని కుమారుడు. ఇతనికి 'సింహసేనుడు' 'అమిత్రఘాత' అనే బిరుదులున్నాయి. బిందుసారునికి సిరియా రాజు మొదటి అందయోకస్‌తో మంచి స్నేహం ఉండేది. స్నేహానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని, అత్తిపండ్లను బిందుసారునికి కానుకలుగా పంపేవాడు. తారాచంద్ అనే బౌద్ధటిబెట్ చరిత్రకారుడు బిందుసారుడిని రెండు సముద్రాల మధ్య ప్రాంతాన్ని పాలించినవాడు అని తన రచనల్లో పేర్కొన్నాడు. బిందుసారుని కాలంలో తక్షశిల రాష్ట్రంలో సైనిక తిరుగుబాటు జరిగింది. దీనిని యువరాజైన అశోకుడు కఠినంగా అణచివేశాడు. బిందుసారుడు చివరి దశలో 'అజీవకమతం'ను స్వీకరించాడు. బిందుసారుడు నాగార్జున గుహలో మరణించినట్లు, అందుకే వాటిని అజీవక మతస్థులకు అంకితం చేసినట్లు కొన్ని గ్రంథాల్లో రాసి ఉంది.

అశోకుడు(273 - 232 క్రీ.పూ.): బిందుసారుని కుమారుడు అశోకుడు. తన పట్టాభిషేకం సందర్భంగా రాజ్యంలో ఉన్న యుద్ధఖైదీలను విడుదల చేశాడు. భారతదేశంలో శాసనాలు ముద్రించిన తొలిరాజు. బ్రాహ్మిలిపిలో పాళి భాషలో గల అశోకుని శాసనాలను జర్మనీకి చెందిన జేమ్స్‌ప్రిన్సెప్ అనే చరిత్రకారుడు తొలిసారిగా గుర్తించి, చదివాడు. అశోకుడు వాయువ్య ప్రాంతంలో సెబాష్‌ఘర్, మన్సార శాసనాలు; ఆఫ్ఘానిస్థాన్‌లో ఖంతహాల్ శాసనం చెక్కించాడు. సిరియా రాజు రెండో ఆంటియోకస్‌తో, ఈజిప్ట్‌రాజు ఫిలడేల్ఫస్‌తో, మాసిడోనియా రాజు ఆంటియోగానస్‌తో, సైరస్‌రాజు మాగాస్‌తో, ఎపిరస్ రాజు అలెగ్జాండర్‌తో మంచి స్నేహసంబంధాలు కొనసాగించాడు.

సామ్రాజ్యకాంక్షతో కళింగపై దండయాత్ర చేశాడు. ఈ యుద్ధం తరవాత అశోకుడు బౌద్ధ దీక్షను స్వీకరించాడు. 3వ బౌద్ధమత సమావేశాన్ని పాటలీపుత్రలో నిర్వహించాడు. 'దేవానాంప్రియ', 'ప్రియదాసి' అనే బిరుదులు అశోకునికి ఉన్నాయి. నైతిక సూత్రాలు ప్రచారం చేయడానికి 18 మంది దర్మమహా మాత్రులను అశోకుడు నియమించారు. దయ, దాతృత్వం, సంక్షేమం ముఖ్యమైన లక్షణాలు 'దర్మ' సూత్రంలో పేర్కొన్నారు. 232 క్రీ.పూ.లో అశోకుడు మరణించాడు.

చివరి మౌర్యరాజులు: అశోకుడి మరణం తరవాత కుణాలుడు రాజ్యానికి వచ్చాడు. ఈ కాలంలో మౌర్య సామ్రాజ్యం రెండుగా చీలిపోయింది. తరవాత వచ్చిన రాజులు దాదాపు 50 సంవత్సరాలు పాలించారు. చివరి మౌర్య రాజైన బృహద్రదుడిని, అతని సేనాని పుష్యమిత్రుడు వధించి మగధను ఆక్రమించి శుంగ వంశాన్ని స్థాపించాడు.



సమాజం పరిస్థితులు: మౌర్యుల కాలంలో బానిస వ్యవస్థ లేదని మెగస్తనీస్, ఉండేదని కౌటిల్యుడు తమ రచనల్లో పేర్కొన్నారు. బహుభార్యత్వం, బాల్య వివాహాలు, సతీసహగమనం మౌర్యుల పాలనలో సాధారణం. వ్యభిచార వృత్తి ఉండేదని డియోడోరస్ రాశాడు. 8 రకాల వివాహాలు జరిగేవని, వీటితో పాటు స్వయం వరం, రాక్షస వివాహం, గాంధర్వ వివాహం కూడా ఉండేవని చరిత్రకారులు పేర్కొన్నారు. మౌర్యులు మద్యపాన ప్రియులు అని మెగస్తనీస్ వ్యాఖ్యానించాడు. ప్రజలు గోధుమ, బార్లీని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. నూలు, పట్టు, వస్త్రాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. బంగారం, వెండి, రత్నాలు కలిగిన ఆభరణాలు ధరించేవారు. జూదం ఆడటం, జంతువులతో పోరాటాలు, మల్ల యుద్ధాలు, ఉత్సవాలు వీరి వినోదాలు.



డాక్టర్ ఐ.నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, సూర్యాపేట

భారతదేశ చరిత్రలో ఏ రాజవంశానికి లేని కేంద్రీకృత పాలన వ్యవస్థ మౌర్యుల కాలంలో కన్పిస్తుంది. అశోకుడు పాటలీపుత్రం కేంద్రంగా ఉంటూ మారుమూల గ్రామమైన సిద్ధాపురంలోని విషయాలను తెలుసుకునేవాడు. మౌర్యులకున్న విస్తృత అధికార యంత్రాంగం చరిత్రలో ఏ రాజవంశంలోనూ కన్పించదు. నిరపేక్ష, నిరంకుశ రాజరికం అధికారాలు చెలాయించేవారు. దేశచరిత్రలోనే తొలిసారిగా శ్రేయో రాజ్యం స్థాపించారు. వీరి పాలనలో మూడు దశలు ప్రధానంగా కన్పిస్తాయి అవి.కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వం, స్థానిక పాలన.

కేంద్ర ప్రభుత్వం: రాజుకు సహాయం చేయడానికి మంత్రిపరిషత్ ఉండేదని మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో రాశాడు. పాలనలో ఆయా విభాగాలను పర్యవేక్షించడానికి 32 మంది అధ్యక్షులు ఉండేవారు. వీరిలో 'సన్నిదాత', 'కోశాధికారి', 'సంహార్తి' పన్నులు వసూలు చేసే అధికారులు.

ప్రాంతీయ పాలన: పాలన సౌలభ్యం కోసం మౌర్యులు తమ సామ్రాజ్యాన్ని నాలుగు ప్రాంతాలుగా, ఆహారాలుగా, రాష్ట్రాలుగా విభజించారు. తూర్పు ప్రాంతానికి తోసలి; పశ్చిమ ప్రాంతానికి తక్షశిల; మధ్య ప్రాంతానికి ఉజ్జయిని,

మౌర్యుల పరిపాలన విధానం

అవంతి; దక్షిణ ప్రాంతానికి సువర్ణగిరి ముఖ్యస్థానాలు. రాష్ట్రాలకు పాలనాధికారులను కుమార మాత్యులు అని అంటారు. వీరికి సహాయంగా రజుక, యుక్త అనే అధికారులు ఉంటారు. 'పురుష' అనే అధికారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాచారం అందించేవారు.

స్థానిక పాలన: స్థల లేదా స్థానిక ప్రధాన పాలన విభాగాలు. వీటి పాలనను స్థానిక, గ్రామిక నిర్వహించేవారు. పాలనలో చివరి భాగం గ్రామం. గ్రామణి పాలన బాధ్యతలు నిర్వహిస్తారు.

నగర పాలన: మెగస్తనీస్ తన ఇండికాలో 30 మంది సభ్యులతో 6 కమిటీలను పురపాలక సంఘం నిర్వహించినట్లు రాశాడు.

సైనిక పాలన: మెగస్తనీస్ రచనల్లో పాటలీపుత్ర నగర పాలన గురించి ఉంది. ఒక్కో కమిటీతో ఐదుగురు సభ్యుల చొప్పున సైనిక పాలన బాధ్యతలు నిర్వహించారు. కాల్బలం, సైనిక జీతభత్యాల నిర్వహణ. అశ్వికదళం, గజదళం, రథ బలం, నౌకాదళం ముఖ్యమైన విభాగాలు. సైనిక చికిత్సలకు అంబులెన్స్ వ్యవస్థ ఉండేదని చాణక్యుడు రాశాడు. సైన్యంలో ఆరు లక్షల కాల్బలం, 30 వేల అశ్వదళం, 9 వేల గజబలం ఉండేదని 'ప్లీని' తన నేచురల్ హిస్టరీ గ్రంథంలో రాశాడు.

11 నుంచి మంగళగిరి వాలీబాల్ లీగ్ పోటీలు

● లోకేశ్ సహకారంతో బోగి ఎస్టేట్స్‌లో టోర్నీ నిర్వహణ

● విజేతకు రూ.లక్ష నగదు బహుమతి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో ఈ నెల 11నుంచి 18వ తేదీ వరకు మంగళగిరి వాలీబాల్ లీగ్-3 టోర్నమెంటు జరుగనుంది. ఈ టోర్నీ తాలూకా గోడప్రతులను మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త నందం అబద్దయ్య, తెలుగు యువత నేతలు ఆదివారం ఆవిష్కరించారు. అబద్దయ్య టోర్నీ వివరాలను వెల్లడిస్తూ పట్టణంలోని నారా లోకేశ్ క్రీడా మైదానం (బోగి ఎస్టేట్స్)లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 7వ తేదీలోపు మంగళగిరి టీడీపీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివ రాలకు సెల్: 9866483147, 9290906826 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేతగా బాలికల జట్టు

మంగళగిరి, ఫిబ్రవరి 4: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో మంగళగిరి నియోజకవర్గ బాలికల జట్టు గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జట్టు సభ్యులు హసీనా (కెప్టెన్), నీలిమాదేవి, కృష్ణకుమారి, లక్ష్మీ, భార్గవి, నాగరాణి, అల్ఫాన్, ధనలక్ష్మీ, అమీషా బీబీ, భానుశ్రీలను వైసీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం అభినందించారు. బాలికల జట్టుకు టీషర్టులు, షూస్, కబడ్డీ కిట్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఐక్యతే సమాజానికి మేలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: జర్నలిస్టుల ఐక్యతే సమాజానికి మేలు చేస్తుందని, జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉంచి తమ హక్కులను సాధించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపాటి నాగిరెడ్డి కోరారు. ఏపీయూడబ్ల్యూజే మంగళగిరి నియో జకవర్గ స్థాయి సమావేశం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో ఆదివారం జరిగింది. జర్నలిస్టుల సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.



వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ప్రజలు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీ రామాంజనేయులు



భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: జగన్ నీవు ఒక్క పథకాన్ని అయినా సక్రమంగా అమలు చేశావా.. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క రోడ్డు అయినా వేశావా... ఇంకా రెండు నెలల్లో ఇంటికి వెళతావు.. నిన్ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారంటూ ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బీ రామాంజనేయులు జగన్‌పై నిప్పులు చెరిగారు. మండల పరిధిలోని నడింపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీవు లేకపోతే పథకాలు మొత్తం ఆగిపోతాయని చెపుతున్నావు..ఎలా నిలిచిపోతాయో చెప్పు అంటూ సూటిగా ప్రశ్నించారు. పేదవానికి అవసరమ్యే ప్రతి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయగలిగిన సత్తా చంద్రబాబుకు ఉందన్నారు. నేడు ప్రతి కుటుంబానికి లబ్ది చేకూరే విధంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను తయారు చేయడం జరిగిందన్నారు. దీనికి ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి వెంకటేశ్వరరావు, శివరామప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం : దానబోయిన

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని, బీసీల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ అన్నారు. తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ చలవతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీసీల మీద ప్రేమ ఉంటే బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి పార్లమెంట్‌కు పంపి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

సుహాస్‌కు సీపీఐ నేతల పరామర్శ

తాడేపల్లి, ఫిబ్రవరి 4: గత వారం రోడ్డు ప్రమాదంలో చెయ్యి విరిగి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీపీఐ తాడేపల్లి కార్యదర్శి సుహాస్‌ను ఆదివారం చిర్రావూరులోని ఆయన స్వగృహంలో సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్ తదితరులు పరామర్శించారు.

నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' కి సంఘీభావం



నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమానికి సంఘీభావం తెలియ జేస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ, ఫిబ్రవరి 4: నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం తాడికొండలో టీడీపీ శ్రేణులు నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ బండారుపల్లి గ్రామానికి చెందిన తోమాటి బాలయ్య మృతి చెందటంతో ఈనెల 8వ తేదీన బాలయ్య కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించటానికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సాధికార సమితి కన్వీనర్ ధూళిపాళ్ల ఏసుబాబు, రెడ్డి వెంకట్రావు, నూతక్కి శంకరి, తోకల రాముడు, షేక్ రఫీ, చింతల లంకనాంచారయ్య, ధనేకుల హరిబాబు పాల్గొన్నారు.

ఈమనిలో స్వల్ప ఉద్రిక్తత

దుగ్గిరాల, ఫిబ్రవరి 4: మండలంలోని ఈమనిలో జనసేన - వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన చిన్నపాటి గొడవ స్వల్ప ఉద్రిక్తతకు కారణమైంది. గ్రామానికి చెందిన మండల వైసీపీ మాజీకన్వీనర్ యడ్ల సాయికృష్ణ ఆదివారం సాయంత్రం మంగళగిరిలో జనసేనలో చేరారు. ఈమని నుంచి కార్యకర్తలతో కలిసి మంగళగిరి బయలుదేరి వెళ్లారు. ర్యాలీ ప్రారంభానికి ముందు తొలుత వైసీపీ జెండాలతో వచ్చిన యువకుడు మరికొందరు జనసేన యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ర్యాలీగా వెళుతున్న సమయంలో ఈమని జడ్పీ హైస్కూల్ వద్ద క్రికెట్‌స్టంప్‌లతో దాడి జరుపగా దళితవాడకు చెందిన ఇద్దరు, జనసేనకు చెందిన ఇద్దరు, గాయపడ్డారు. స్వల్పగాయాలతో తెనాలి ప్రభుత్వవైద్యశాలలో ఇద్దరు చేరగా, మరో ఇద్దరిలో ఒకరు స్వల్పంగా గాయ పడగా, మరొకరి తలకు బలమైన గాయమైనట్లు తెలుస్తోంది.

ఆశా వర్కర్ల చలో విజయవాడ జయప్రదం చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ

మేడికొండూరు, ఫిబ్రవరి 4: ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, వారికి జీవిత భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. వారి డిమాండ్ల సాధన కోసం ఈనెల 8వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్ యూనియన్ సీఐటీయూ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి టాన్యా, మండల ప్రజా సంఘాల కన్వీనర్ బొట్ల రామకృష్ణ, సీఐటీయూ మహిళా నాయకురాలు వెంకాయమ్మ, సులోచన, ఉమాదేవి, పద్మ, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ



మంగళగిరిలో చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి, ఫిబ్రవరి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, తెలుగుయువత గుంటూరు పార్లమెంటు అధికార ప్రతినిధి కందుల నాగార్జున సంయుక్త సహకారంతో మంగళగిరి పట్టణంలోని పదిమంది చిరువ్యాపారులకు, ఒక ఎలక్ట్రీషియన్‌కు చేయూతనందించారు. 11వ వార్డులోని పోలేరమ్మ ఆలయం సమీపంలో ఆదివారం లబ్ధిదారులకు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు మాట్లాడుతూ లోకేశ్ స్ఫూర్తితో నాగార్జున చిరువ్యాపారులకు తోపుడు, టిఫిన్ బండ్లు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నేతలు పడవల మహేష్, వాకా మాధవరావు, బాలకృష్ణ, కారంపూడి చిరంజీవి, కారంపూడి శివరామకృష్ణ, పొట్లాబత్తుని దుర్గాప్రసాద్, కొల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి, ఫిబ్రవరి 4: తాడేపల్లి మండలం ప్రాతూరులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్ సహకారంతో ఆదివారం ప్రాతూరు టీడీపీ కార్యాలయం వద్ద గుర్రపు రత్తయ్యకు ఒక తోపుడు బండి, ఇసుకపల్లి నాగమణికి బడ్డీ కొట్టు, యలవర్తి సుబాష్‌కు సెలూన్ చైర్ జీవనోపాధి నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరా సుబ్బారావు, అరవపల్లి శ్రీనివాస్, ప్రాతూరి రాజేష్, ఆలపాటి సాంబయ్య, పాటిబండ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌చంద్ సహకారంతో శ్రామికుడికి చేయూత

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ మీరా హుస్సేన్ అనే శ్రామికుడికి మార్బుల్ కటింగ్ మిషన్, గ్రైండింగ్ మిషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్, టీడీపీ నేతలు మాదల రమేష్‌బాబు, మొద్దుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎల్‌సీ ఆఖరి బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న దుగ్గిరాల జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 4: దుగ్గిరాల జడ్పీహైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్వ విద్యా ర్థులు తొలిసారిగా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. పాఠశాల విద్యలో పదో తరగతి ప్రవేశపెట్టక ముందు చదివిన 1968-69 ఎస్ఎస్ఎల్‌సీ ఆఖరిబ్యాచ్ పూర్వ విద్యార్థులు 54ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు.

పెదవడ్లపూడిలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



రేవేంద్రపాడు హైస్కూల్లో పూర్వవిద్యార్థుల గ్రూప్ ఫోటో

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 4: రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పెదవడ్లపూడిలోని గోలి నాగశయనరావు తోటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలుకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తాము విద్యనభ్యసించిన హైస్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

తెనాలి వార్తలు



టీడీపీలో చేరిన నిడుబ్రోలు వైసీపీ యువత

వైసీపీ నుంచి టీడీపీలోకి యువకుల చేరిక

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన 8, 12 వ వార్డులకు చెందిన వైసీపీ యువత ఆదివారం మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల పరిధిలోని చింతలపూడి నరేంద్రకుమార్ స్వగృహంలో యువతకు పార్టీ కండువాలు కప్పి నరేంద్రకుమార్ ఆహ్వానించారు. నిడుబ్రోలుకు చెందిన బేతపూడి సునల్, వలివేటి సుధాకర్, జంపని వెంకటేశ్వరరావు, ముద్రబోయిన సాంబయ్య తదితర్లు టీడీపీలో చేరారు. నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ సమక్షంలో చేరికలు జరిగాయి.

కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ నాయకులు పొన్నగంటి వాసు, గోగినేని సుభాష్, నీలం జ్ఞాన సుందరరావు, గూడవల్లి ఏసు పాదం, యాతాటి కిరణ్, చందు, గాలిబ్, ఓరుగంటి మహేష్, కందేపు సుబ్బారావు, కాటూరి దానేష్ గౌడ్, జగపతి తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర, ఫిబ్రవరి 4: కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో రూ.8.70కోట్లతో నూతనంగా నిర్మించిన హాస్పటల్ భవనాన్ని జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎంపీపీ పద్మావతి, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ మెంబర్ బొమ్మా రెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో శివకుమార్ మాట్లాడుతూ విద్య, వైద్యరంగాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేసినట్లు తెలిపారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పట్టణంలో, ప్రతిగ్రామంలో మెరుగైన వైద్యసేవలు అందించటం కోసం వెల్‌నేస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాజీ మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తన కుమారుడైన వెంకటరమణకు గుంటూరు ఎంపీగా అవకాశం కల్పించబోతున్నారని అందరూ అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, రాష్ట్ర వైసీపీ కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంవీ శివరామకృష్ణారెడ్డి, అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, డీసీహెచ్ఎస్ డీఎస్‌హెచ్ డాక్టర్ సుబ్రహ్మణ్యరాజు, మెడికల్ ఆఫీసర్ సుజాతలక్ష్మి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చిలుమూరి ఝాన్సీ కేసన శ్రీలత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొలెవరంలో వధువుకు ఆలపాటి పెండ్లికానుకను అందిస్తున్న గ్రామ టీడీపీ నాయకులు

ఆలపాటి వివాహ కానుకలు అందజేత

తెనాలి రూరల్, ఫిబ్రవరి 4: ఆడబిడ్డల వివాహానికి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారి తల్లిదండ్రులకు భరోసాగా నిలుస్తున్నారని టీడీపీ నాయకులు, కొలెవరం గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని కొలెవరంలో గొట్టిముక్కల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతుల కుమార్తె వెంకరమణ వివాహాన్ని పురస్కరించుకుని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపించిన ఆలపాటి పెండ్లికానుక బంగారు ఉంగరం, నూతన వస్త్రాలను వధువుకు గ్రామపార్టీ శ్రేణులతో కలిసి అందించి ఆశీస్సులందించారు. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన పఠాన్ అమీనా కుమార్తె షాహినా వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి పెండ్లికానుక ఉంగరాన్ని, నూతన వస్త్రాలను పార్టీ నాయకులు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యావరణాన్ని కాపాడుకోవాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కుమార్, కోటేశ్వరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 4: పట్టణంలో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక చినరావులోని సత్యనారాయణ పార్కులో ఆదివారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చున్నారు. తద్వారా భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని కోరారు. కార్యక్రమంలో నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరావు, తోట రఘురాం, తాడిబోయిన రమేష్, గోపి, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్లు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 4: పట్టణంలో పేదప్రజల కోసం మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకుడు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు వెనిగళ్ళ శివప్రసాద్ అన్నారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్, శివాజీచౌక్‌లో అన్న క్యాంటీన్‌లలో ఆదివారం జెట్టి భానుప్రసాద్ మూడో వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు జెట్టి కిషోర్, కుమార్తె రేణుక వారి కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ఎం.వెంకట్, ఎం.కోటేశ్వరరావు, వి.శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, గుమ్మడి ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న స్వామీజీలు, ముగింపు ఉత్సవాల్లో భారీగా పాల్గొన్న భక్తులు

ముగిసిన శ్రీవెంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలు

● ఘనంగా పూర్ణాహుతి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 4: గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీవెంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలు ఆదివారం ముగిశాయి. తాలూకా జూనియర్ కళాశాల ఆవరణలో ముగింపు కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వెంకటేశ్వరయోగి హాజరయ్యారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో ఉండే ఏడు చక్రాలకు ఏడు కొండలు ప్రతీకగా ప్రవచించారు. శ్రీ వెంకటేశ్వరుని భక్తితో పూజించే వారి కుండలినీ శక్తి జాగృతమవుతుందని వివరించారు. ప్రముఖ విద్వాంసుడు బాచెంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి వెంకటేశ్వరుని వైభవాన్ని వివరించారు. రామానంద భారతీ స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శ్రీసాలిగ్రామ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, ఉప్పల నాగేశ్వరరావు, ముద్దాబత్తుని రమణయ్య, విద్యాపీఠం, మాతృమండలి, మఠం సభ్యులు కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

తక్కెళ్ళపాడులో డీవీసీ ఆసుపత్రి వైద్య శిబిరం



తక్కెళ్లపాడులో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి

పెదకాకాని, ఫిబ్రవరి 5: పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో డీవీసీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంను డీవీసీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ శిబిరంలో 450 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డీవీసీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మెడికల్ క్యాంపునకు ఏర్పాటుకు సహకరించిన డీవీసీ హాస్పిటల్ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు, డీవీసీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయికి తక్కెళ్ళపాడు గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ అమరేంద్ర, జనరల్ సర్జరీ డాక్టర్ ఆశిష్, ఆర్థోపెడిక్స్ డాక్టర్. వినయ్, గైనకాలజి డాక్టర్ శృతి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొల్లిపరలో మండల బ్రాహ్మణ ఐక్యవేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర, ఫిబ్రవరి 4: బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో మండల బ్రాహ్మణ ఐక్యవేదికను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయంగా ఉండేటటువంటి బ్రాహ్మణులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా బ్రాహ్మణ భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, బ్రాహ్మణ సంఘ నాయకులు పరాశరం జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, కల్వకొట్టి వీరభద్రేశ్వరశర్మ, సూర్యనారాయణ శాస్త్రీ, చల్లా కోదండరామ శర్మ, పెనుమర్తి వెంకటరమణశర్మ, పోతురాజు రాంబాబు, గాదెరాజు భాస్కరశర్మ, కొల్లిపర కుటుంబరావు, వెంకటేశ్వర శర్మ, ముక్కామల ప్రసాద్, గ్రామ పెద్దలు అవుతు కృష్ణారెడ్డి, కల్లం వీరారెడ్డి, జొన్నల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 4: పట్టణంలో ప్రభుత్వ మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. శేకూరు గ్రామానికి చెందిన చిలకా యలమంద 30 క్వాటర్ బాటిళ్ళ ప్రభుత్వ మద్యాన్ని చెంచుపేటలోని అవరావతి ప్లాట్స్ చావాస్ గ్రాండ్ వద్ద అమ్ముతుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో నిందుతుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



సాయిని సన్మానిస్తున్న పెన్షనర్లు

రచయిత సాయికి సన్మానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 4: రచనా సాహిత్య రంగాల్లో సేవలు అందిస్తున్న లక్కరాజు సాయి అభినందనీయుడని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500లకు పైగా సంగీత, సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారని, పలు గ్రంథాలు రచించి సమాజాన్ని మేల్కొల్పారని చెప్పారు. కార్యదర్శి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ హోమియో న్యాచురోపతి వైద్యంలో కూడా ప్రావీణ్యం ఉన్న సాయి ఆ విభాగాల్లో కూడా సమాజానికి సేవలు అందించారన్నారు. గరికపాటి సుబ్బారావు, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

సాధించిన ప్రగతిని దాతలకు వివరించాలి

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్

● ఆర్వీఆర్‌జేసీ విద్యార్థినులకు ఉపకారవేతనాల పంపిణీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 4: తాముసాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు ఫోన్, మెయిల్, లేఖలద్వారా వివరించాలని, అప్పుడే దాతలు మరింతసాయం చేయడానికి ముందుకొస్తారని కమ్మజన సేవసమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లిరమేష్‌లు అన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ కేజేఎస్ఎస్ ఆవరణలో ఆర్వీఆర్‌జేసీ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద, ప్రతిభ వంతులైన 25 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున తెనాలికి చెందిన దాత రావి హనుమంతు రావు చేతులమీదుగా ఉపకార వేతనాలు అందజేశారు. అనంతరం సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ.. తెనాలికి చెందిన ప్రవాస భారతీయులు రావి మానస్‌వరుణ్ ఇచ్చిన రూ.5 లక్షలసాయాన్ని విద్యార్థినులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. దాతల తోడ్పాటు పొందిన విద్యార్థినులు కూడా భవిష్యత్తులో సాయంచేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. దాత రావి హనుమంతురావు మాట్లాడుతూ ప్రతిభను ఇలాగే కొనసాగిస్తే వచ్చే మరో రెండు సంవత్సరాలు కూడా ఉపకార వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్వీఆర్‌జేసీ కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, సమితి ఉపాధ్యక్షులు వి.నాగేంద్రం, పాలకవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, మైనేని సీతారామయ్య, తేళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణయ్య హత్య దారుణం

● వినుకొండ రాజారావు

పెదకాకాని, ఫిబ్రవరి 4: విశాఖపట్నం గ్రామీణ తహసీల్దార్ సనపల రమణయ్య హత్య దారుణమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న అధికారిపై పాశవికంగా దాడిచేసి హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి హంతకులకు త్వరగా శిక్ష విధించేటట్లుగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రమణయ్య కుటుంబానికి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని, అలాగే ఉద్యోగులపై అరాచకాలు, వేధింపులకు గురిచేస్తూ హత్యలుచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న రౌడీమూకలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి అణచివేయాలని, ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, తహసీల్దారు రమణయ్యను హత్యచేసిన హంతకులను, వెనుక ఉన్న ముఠాను కఠినంగా శిక్షించాలని రాజారావు డిమాండ్ చేశారు.

8న కొలకలూరులో కాంగ్రెస్ రచ్చబండ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన రూరల్ మండలం కొలకలూరులో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటన సందర్భంగా ప్రజలతో మమేకమయ్యేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని తెనాలి నియోజకవర్గంలోని కాంగ్రెస్ అభిమానులంతా జయప్రదం చేయాలని కోరారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం బాపట్ల జిల్లాకు బయలుదేరి వెళతారని తెలిపారు. జాకీర్ హుస్సేన్, చాంద్‌బాషా, సురేష్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సంపత్ కుమార్‌ను సత్కరిస్తున్న వీవీఐటీ అధ్యాపకులు

సంపత్ కుమార్‌కు విశ్వనాథ సంస్కృతి పురస్కారం

పెదకాకాని, ఫిబ్రవరి 4: గుంటూరు విశ్వనాథ సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం కళారంగానికి చెందిన ప్రముఖులకు అందించే విశ్వనాథ సంస్కృతి పురస్కార వేడుకను వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకకు వీవీఐటీ విద్యాసంస్థల యాజమాన్య సభ్యురాలు వాసిరెడ్డి అరుణ ప్రియ, కళాశాల జాయింట్ సెక్రెటరీ మామిళ్ళపల్లి శ్రీకృష్ణ, విశ్వనాథ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ మద్దినేని సింహకౌటిల్య చౌదరి, సాహితీవేత్త బూసురుపల్లి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 2024 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ ఒంగోలు జిల్లాకు చెందిన తరంగ భజన పండితులు ఘోరకవి సంపత్ కుమారును విశ్వనాథ సంస్కృతి పురస్కారంతో సత్కరించారు. అలాగే ప్రముఖ రంగస్థల నటి గుడివాడ లహరిను పి.సత్యనారాయణ రాజు కళావేదిక సత్తెనపల్లివారు సూర్యకాంతం స్మారక నట పురస్కారం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి అరుణప్రియ మాట్లాడుతూ కళలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని, ఇటువంటి కళలు తరువాతి తరానికి అందించటానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో మోదుగుల రవికృష్ణ, సెల్లెం చంద్రమోహన్, ఏఎన్‌యూ పూర్వ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అబాకస్ పోటీలలో చిన్నారుల ప్రతిభ



అబాకస్ పోటీలలో బహుమతులు సాధించిన ప్రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులు

చేబ్రోలు, ఫిబ్రవరి 4: జిల్లా స్థాయి అబాకస్ పోటీలలో చేబ్రోలు ప్రెసిడెన్సీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ వాసిరెడ్డి బన్‌బాబు తెలిపారు. ఆదివారం విద్యార్థుల అభినందన కార్యక్రమం పాఠశాలలో జరిగింది. పాఠశాలకు చెందిన బాలభవ్యశ్రీ జూనియర్ లెవల్‌లో మొదటి బహుమతిని, కె కృష్ణ వెంకట శివసాయి స్టార్ జూనియర్స్ లెవల్‌లో రెండో బహుమతిని అందుకున్నారు. గుంటూరు అగ్రహారం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని ప్రతిభ చూపారు. బహుమతులు సాధించిన ప్రెసిడెన్సీ స్కూల్ చిన్నారులను పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

గుంటూరుకు చేరుకున్న ఈశ్వరీదేవి మాత పీఠం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి4: కందిమల్లయ్యపాలెం, ఈశ్వరిదేవి మాత మఠం, ఆస్థాన పీఠం ధార్మిక పర్యటనలో భాగంగా ఆదివారం గుంటూరు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా అరండలపేటలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో పీఠాధిపతులు వీర శివకుమార్ పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.



ఆడుదాం ఆంధ్రలో ద్వితీయ స్థానంలో నిల్చిన వేజండ్ల వాలీబాల్ జట్టు

వాలీబాల్ పోటీల్లో వేజండ్ల జట్టుకు ద్వితీయస్థానం

చేబ్రోలు, ఫిబ్రవరి 4: జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర వాలీబాల్ పోటీలలో వేజండ్ల మహిళా జట్టు ద్వితీయస్థానం సాధించింది. ఈ నెల 1 నుంచి గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి పోటీలలో వేజండ్ల వాలీబాల్ జట్టు పలుజట్లతో తలపడి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం మహిళా వాలీబాల్ జట్టు క్రీడాకారులను వేజండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.విజయశ్రీ, పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



మాజీ సర్పంచ్ సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరేంద్ర కుమార్ తదితరులు

మాజీ సర్పంచ్ సుబ్బారావుకు టీడీపీ నేతల నివాళి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని కసుక్రర్రు గ్రామ మాజీ సర్పంచ్ బొప్పన సుబ్బారావు సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కసుక్రర్రు గ్రామంలో బొప్పన సుబ్బారావు సంతాప సభ జరిగింది. సభకు హాజరైన నరేంద్ర కుమార్ సుబ్బారావు తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీచైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆకుల సాంబశివరావు, చెల్లెశెట్టి సీతారమయ్య, బాపనయ్య, కూరపాటి దిలీప్, మున్నంగి సుబ్బారెడ్డి, మద్ది శ్రీను, కొండేపు సుబ్బారావు, నాగిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు నరేంద్ర నివాళి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: టీడీపీ సీనియర్ కార్యకర్త నిమ్మగడ్డ సిల్వస్‌కు మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ నివాళులు అర్పించారు. మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన సిల్వస్ టీడీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆదివారం సిల్వస్ మృతి సమాచారం తెలుసుకున్న నరేంద్రకుమార్ సిల్వస్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిల్వస్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు సిల్వస్ మృతదేహానికి నివాళులు అర్పించారు.



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ఫ్లెక్సీ చించివేతపై జనసేన కార్యకర్తల నిరసన

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని చింతలపూడిలో జనసేన ఫ్లెక్సీను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. వైసీపీకి చెందిన మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆదివారం జనసేనలో చేరుతున్న సందర్భంగా జనసేన కార్యకర్తలు మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను శనివారం రాత్రి అధికార వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చింపివేశారంటూ నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా జనసేన పార్టీ కార్యాలయంలో మండల కార్యకర్తలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నారు. కేవలం జనసేనకు ఆదరణ లభిస్తుందనే కారణంతో వైసీపీ నాయకులు ఈ దురాఘతానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫ్లెక్సీల చించివేతపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగిశెట్టి సుబ్బారావు, యన్నం నాయుడు, దేశంశెట్టి సూర్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారంలో భారీ అవకతవకలు: బీజేపీ

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: ఇటీవల తుఫాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించటం కోసం రూపొందించిన జాబితాలో భారీ అవకతవకలు జరిగినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు వడ్రాణం ఉదయ్‌చంద్రరావు ఆరోపించారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉదయ్ చంద్రరావు మాట్లాడుతూ మండల పరిధిలోని వట్టిముక్కల గ్రామంలో ఓ వలంటీరు వ్యవసాయ శాఖ సిబ్బంది అక్రమార్కులకు జాబితాలో చోటు కల్పించినట్లు ఆరోపించారు. వలంటీరు కుటుంబ సభ్యులే కాకుండా అసలు పొలాలు లేనివారిని, వ్యవసాయం చేయని వారిని గ్రామాల్లో నివాసం ఉండని వారి పేర్లతో పంట నష్టపరిహారం లెక్కింపు జాబితాను రూపొందించిన్నట్లు తన దృష్టికి వచ్చాయన్నారు. వడ్డిముక్కల గ్రామమేకాకుండా మన్నవ లాంటి గ్రామంలో అనర్హులను జాబితాలో చోటు కల్పించి అర్హులైన రైతులకు అన్యాయం చేసేవిధంగా అధికార పార్టీ నాయకులు తప్పుడు జాబితాను రూపొందించారని ఉదయ్‌చంద్రరావు ఆరోపించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్ట పరిహార జాబితాలో అనర్హులకు చోటు కల్పించేందుకు సహకరించినట్లు ఆరోపించారు. అర్హులైన రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పంట నష్టపరిహారం లెక్కింపుల జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నిర్మాణరంగ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

● ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు



భవన నిర్మాణరంగ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందచేస్తున్న యూనియన్ నాయకులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 4: నిర్మాణరంగ కార్మికుల కుటుంబాలను సంక్షేమ బోర్డు ద్వారా ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు కోరారు. భవన నిర్మాణరంగ కార్మికుడు జంపాల వీరాస్వామి ఆదివారం మృతి చెందాడు. వీరాస్వామి మృతదేహాన్ని సందర్శించిన ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు వీరాస్వామికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పగడాల వెంకటేశ్వర్లు, కల్వకోళ్ల బాబు, శివకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.